వణికిస్తున్న విష జ్వరాలు

ఒళ్లు నొప్పులు.. తలనొప్పితో మంచం పట్టిన జ్వర పీడితులు

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో గ్రామీణులకు కష్టాలు

బాపట్ల, న్యూస్‌టుడే

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లో జ్వరంతో బాధపడుతున్నవారు ఉన్నారు. చలి, జ్వరం, తలనొప్పి, జలుబు, దగ్గు సమస్యలతో ఆసుపత్రులకు వచ్చేవారు పెద్దసంఖ్యలో ఉంటున్నారు. చీరాల, బాపట్ల ఆసుపత్రుల్లో ఓపీ పరిశీలిస్తే సగం పైగా జ్వర పీడితులే ఉంటున్నారు. గన్యా జ్వరంతో ఒంటి నొప్పులతో కదల్లేక బాధపడుతున్నారు. లంక గ్రామాల్లో డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. జ్వర పీడితులతో ప్రాంతీయ, సామాజిక ఆసుపత్రులతో పాటు ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పీహెచ్‌సీ వైద్యులు సమ్మెలో ఉండటంతో గ్రామాల్లో వైద్య సేవలకు ఆటంకం ఎదురవుతోంది.

వరద ప్రభావిత కొల్లూరు, భట్టిప్రోలు లంక గ్రామాల్లో నీరు ఎక్కువ రోజుల నిల్వ ఉండి దోమల ఉద్ధృతి కారణంగా ప్రజలు డెంగ్యూ జ్వరాల బారినపడుతున్నారు. రేపల్లె పట్టణం, మండలం, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లోను కేసులు వస్తున్నాయి. తెల్లరక్త కణాల సంఖ్య తగ్గి వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి రోగులు రూ.వేలు ఖర్చు చేస్తున్నారు. బాపట్లలో విష జ్వరాల బాధితులు ఎక్కువగా ఉన్నారు. డెంగ్యూ జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. డెంగ్యూ జ్వర బాధితులు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స కోసం రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు పెడుతున్నారు. డెంగ్యూ జ్వరాల కేసులు అధికారికంగా చూపిన దానికన్నా మూడు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రి ఓపీ విభాగంలో రోజూ నాలుగు వందల వందికిపైగా వైద్య సేవలు పొందుతున్నారు. వీరిలో అత్యధికులు జ్వర పీడితులే ఉన్నారు. చిన్నారులు, విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో వార్డుల్లో చికిత్స పొందుతున్నారు. జ్వరం రెండ్రోజుల్లో తగ్గినా ఒళ్లు నొప్పులు మాత్రం వారం రోజులు ఉంటున్నాయి. మంచానికే పరిమితమై ఏ పని చేయలేకపోతున్నారు. చీరాల ప్రాంతీయ ఆసుపత్రి ఓపీకి 450 మంది వరకు రోగులు వస్తుండగా సగం మంది జ్వరాలతో బాధపడుతున్నారు.


జ్వర పీడితులతో కిక్కిరిసిన ప్రాంతీయ ఆసుపత్రి వార్డు

ఈ ఏడాది నమోదైన డెంగీ కేసులు 126

గన్యా కేసులు 03

డెంగీ మరణాలు 01

పెరిగిన దోమల ఉద్ధృతి

జిల్లావ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు సమ్మెలో ఉన్నారు. పది రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. దీని వల్ల పీహెచ్‌సీల్లో జ్వర పీడితులకు సరైన వైద్య చికిత్స అందడం లేదు. చికిత్స కోసం ఆర్‌ఎంపీలు, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రాంతీయ ఆసుపత్రుల్లో రక్త పరీక్షలు 30 శాతం, ప్రైవేటు ప్రయోగశాలల్లో 40 శాతం పెరిగాయి. డెంగ్యూ జ్వరాలు గుర్తించడానికి కిట్లు అందజేశారు. వర్షాలతో పట్టణాలు, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచింది. మూడు వారాలుగా నీరు నిల్వ ఉండటం వల్ల దోమల ఉద్ధృతి పెరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో జ్వరాల కేసులు పెరిగాయి. నిల్వ ఉన్న నీటిని తక్షణమే తొలగించి దోమల నివారణ మందులు పిచికారీ చేయాలి. దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వదలాలి.

ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం

ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలను క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంచాం. ఎక్కడ జ్వరాలు ఉన్నా వెంటనే ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు, మలేరియా విభాగం ద్వారా దోమల నివారణ చర్యలు చేపడుతున్నాం. జ్వర పీడితులు వైద్యశాలకు వచ్చి రక్త పరీక్షలు చేయించుకుని వైద్యుని వద్ద చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యంగా ఉండరాదు. - విజయమ్మ, డీఎంహెచ్‌వో

ముగ్గురు ఆర్డీవోల బదిలీ

బాపట్ల: జిల్లాలో ముగ్గురు ఆర్డీవోలు బదిలీ అయ్యారు. బాపట్ల కొత్త ఆర్డీవోగా పి. గ్లోరియా, చీరాల ఆర్డీవోగా దేవరకొండ అఖిల, రేపల్లె ఆర్డీవోగా ఎన్.రామలక్ష్మి నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం బాపట్ల ఆర్డీవోగా పని చేస్తున్న జి.రవీందర్, చీరాల ఆర్డీవో సూర్యనారాయణరెడ్డికి పోస్టింగ్ ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. రేపల్లె ఆర్డీవోగా పని చేస్తున్న బీఎస్. హెలా షారోన్‌ను కృష్ణా జిల్లా ఉయ్యూరు ఆర్డీవోగా బదిలీ చేశారు.

వదలని వర్షం.. వీడని ఆందోళన

దెబ్బ మీద దెబ్బతో రైతు కుదేలు

పిట్టలవానిపాలెం, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, భట్టిప్రోలు, న్యూస్‌టుడే : ఆగస్టు నెలాఖరులో కురిసిన భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులు కష్టమైనా మళ్లీ నారు కొనుగోలు చేసి నాట్లు వేశారు. తీరా రెండ్రోజుల నుంచి రాత్రివేళ కురుస్తున్న భారీ వర్షాలకు పొలాలు నీట మునిగాయి. నాట్లు వేసిన వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. దెబ్బ మీద దెబ్బతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పిట్టలవానిపాలెం మండలం కోమలి, భవనంవారిపాలెం, చందోలు, సంగుపాలెం ప్రాంతంలో పొలాలు పూర్తిగా నీట మునిగాయి. గతం ఎప్పుడు లేని విధంగా వర్షపు నీరు పైరుపై నిలకడగా ఉండటంతో దిక్కుతోచని పరిస్థితి రైతుల్లో నెలకొంది. భట్టిప్రోలు మండలంలో అద్దేపల్లి బాడవ పొలాలు నది పాయను తలపిస్తున్నాయి. ప్రధాన మురుగుకాల్వ పూడటంతో రైతులు నష్టపోవాల్సి వస్తోంది. నెల రోజుల్లో మూడు పర్యాయాలు వరి నాట్లు వేసే పరిస్థితి ఎవరికీ రాకూడదని, ఈ ఏడు మరింత అప్పుల ఊబిలో కూరుకుపోవడం ఖాయమని ఆవేదన చెందుతున్నారు. నాలుగైదేళ్లుగా పాలకులు మురుగు కాలువ వ్యవస్థను నిర్లక్ష్యం చేసిన కారణంగా ముంపునకు గురైన పొలాల్లో నీరు బయటకు పోవటం లేదని రైతులు అంటున్నారు. వెంటనే అధికారులు స్పందించి మురుగుకాలువల్లో అడ్డంకిగా పూడిక, గుర్రపుడెక్క తొలగించి మురుగు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పి.వి.పాలెం: కోమలిలో చెరువులా మారిన భూములు


నగరం-ఈదుపల్లి గ్రామాల మధ్య నీట మునిగిన వరి పొలాలు

పర్యాటకం.. ప్రగతి చోదకం

జిల్లాలో సందర్శనీయ క్షేత్రాలు ఎన్నో..

ఈనాడు-బాపట్ల

జిల్లాలో ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి ప్రసాదిత రమణీయ దృశ్యాలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. ఉండవల్లి గుహలు, ప్రకాశంబ్యారేజీ అందాలు, అమరావతి ధ్యానబుద్ధ విగ్రహం, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి, ఉప్పలపాడు పక్షుల కేంద్రం, కొండవీడు కోట, గుత్తికొండ బిలం, దైద అమరలింగేశ్వరస్వామి, కోటప్పకొండ, నాగార్జునసాగర్ కొండ, అనుపు, సూర్యలంక తదితర ప్రాంతాలతో పాటు ఎకో టూరిజం పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ప్రకృతి రమణీయత మధ్య ప్రవహించే కృష్ణా నది.. బంగాళాఖాతం తీర ప్రాంతంలో ఆకట్టుకునే బీచ్‌లు జిల్లాకు పర్యాటకంగా అదనపు సొబగులు అద్దుతున్నాయి. అయితే ఆయా ప్రాంతాల్లో వసతులు మెరుగుపరిచి పర్యాటక అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రత్యేక కథనం.



ప్రభుత్వం దృష్టిసారిస్తే మరింత ఉపాధి అవకాశాలు


ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో పక్షుల కిలకిలరావాలు, స్థానిక చెరువులో సేదదీరడం, సాయంత్రం వేళ అక్కడి పక్షుల అందాలు, ప్రకృతి రమణీయ దృశ్యాలు ఎంతో కనువిందు చేస్తాయి.

❖ పంచారామాల్లో మొదటిదైన అమరావతి, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి, పెదకాకాని శివాలయం, పొన్నూరు ఆంజనేయస్వామి, కోటప్పకొండ మీద కొలువైన శివుడు, దైద అమరలింగేశ్వరస్వామి, వైకుంఠపురంలో వెలసిన వెంకటేశ్వరస్వామి, గుంటూరులోని మస్తానయ్య దర్గా, ఫిరంగిపురంలోని పురాతన చర్చి ఇలా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆధ్యాత్మికంగా దేనికదే ప్రత్యేకత కలిగిఉన్నాయి. అమరావతిలో 125 అడుగుల ధ్యానబుద్ధ విగ్రహాన్ని నిర్మించారు. విగ్రహం లోపలివైపు బౌద్ధుల చరిత్ర తెలిపేలా చెక్కిన శిల్పాలు ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఆయా ప్రజలు దేశ, విదేశాల నుంచి ఇక్కడి ఆలయాలను సందర్శిస్తున్నారు.

❖ బాపట్ల తీరంలోని సూర్యలంక బీచ్ ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తోంది. వారాంతాల్లో సేదతీరడానికి పర్యాటక నిలయంగా మారింది. ఇక్కడి బీచ్ ప్రమాదరహితంగా ఉండటం, రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉండటం, రవాణాసౌకర్యాలు మెరుగ్గా ఉండటంతో పర్యటకులకు సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

❖ ప్రకృతి ప్రసాదిత కృష్ణానది అందాలు పర్యటకులకు కనువిందు చేస్తున్నాయి. ఈ ఏడాది కృష్ణానదికి ఎక్కువ రోజులు వరదనీటి ప్రవాహం ఉండటంతో నదికి జలకళ సంతరించుకుంది. కృష్ణానదిపై నాగార్జునసాగర్, టెయిల్ పాండ్, పులిచింతల ప్రాజెక్టు, ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయిలో నిండి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ప్రాజెక్టుల గేట్లు ఎత్తినప్పుడు కృష్ణమ్మ అందాలు చూడటానికి పోటెత్తుతున్నారు. అక్కడి నుంచి ఎత్తిపోతల జలపాతం హోయలు చూసి మైమరిచిపోయే పర్యటకుల సంఖ్య ఈ ఏడాది గణనీయంగా పెరిగింది.

❖ కొండవీడు కొండల పచ్చదనం, వంకరలు తిరుగుతూ సాగే కొండవీడు ఘాట్ రోడ్డు, ఉదయాన్నే అక్కడి చల్లదనం, ఎటుచూసినా పండ్లు, కూరగాయలు, పూల తోటలు మదిని మరిచిపోయేలా ఆకట్టుకుంటున్నాయి. కొండవీడు కోటను సాహస క్రీడలకు అనుకూలంగా అభివృద్ధి చేశారు. జిల్లా కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులు ట్రెక్కింగ్ చేసి ప్రోత్సహించారు. ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఇక్కడి కొండలను అభివృద్ధి చేయాలి.



పర్యాటక సర్క్యూట్‌లతో అభివృద్ధి

పర్యాటక ప్రాంతాల్లో వసతులు కల్పించి నరసరావుపేట నుంచి పల్నాడు జిల్లాలోని ప్రముఖ పర్యాటక, దర్శనీయ ప్రాంతాలకు పర్యాటకుల్ని తీసుకెళ్లేలా గతంలో కార్యచరణ రూపకల్పన చేశారు. ఆ ప్రతిపాదనల్ని ఆచరణలోకి తీసుకొస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి జరుగుతుంది. ఆ సర్క్యూట్లు ఇలా... ❖ నరసరావుపేట నుంచి కోటప్పకొండ, చెంఘీజ్‌ఖాన్ పేట ఇస్కాన్ టెంపుల్, కొండవీడు, అమరావతికి తీసుకెళ్లి రాత్రికి మళ్లీ నరసరావుపేటకు తీసుకురావాలనే ఆలోచన చేశారు.

❖ నరసరావుపేట నుంచి బయలుదేరి చేజర్ల కపోతేశ్వర ఆలయం, గుత్తికొండ బిలం, కారంపూడి వీర్ల దేవాలయం, దైద, మాచర్ల చెన్నకేశవ ఆలయం, ఎత్తిపోతల, నాగార్జునసాగర్ చూపించడం ఒక ప్యాకేజి అయితే ఇందులోనే రాత్రికి నాగార్జునసాగర్‌లో విశ్రాంతి తీసుకుని మరుసటి రోజు నాగార్జునకొండ, అనుపు చూపించి నరసరావుపేటకు తీసుకురావాలనే ఆలోచన ఉంది.

ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆకట్టుకునే పర్యటక, ఆధ్యాత్మిక, ప్రకృతి రమణీయ ప్రాంతాలు ఉండటంతో ఏటికేడు పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. దేశ, విదేశీ పర్యాటకులు వస్తుండటంతో వారి అభిరుచులకు అనుగుణంగా ఇక్కడి సంస్థలు సేవలు అందిస్తున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మంది పర్యాటకరంగం ఆధారంగా ఉపాధి పొందుతున్నారు. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పర్యాటక రంగాన్ని నిర్వీర్యం చేయడంతో ఉపాధి అవకాశాలు మృగ్యమయ్యాయి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రగతి చోదకంగా నిలుస్తుందని జిల్లావాసులు చెబుతున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాల కట్టడిపై దృష్టి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరగకుండా అందరూ దృష్టిసారించాలని ఆర్డీవో హెలాషారోన్ సూచించారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి గురువారం మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు నదీ పరివాహక ప్రాంతాల్లో ఏడు చోట్ల చెక్‌పోస్టు ఏర్పాటు చేయించామన్నారు. నదిలో నుంచి ఇసుకను తరలించే ప్రదేశాలను గుర్తించి పూర్తిస్థాయిలో కట్టడి చేసేందుకు 24 గంటలు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అక్టోబరు 15న గాజుల్లంక, జువ్వలపాలెం ఇసుక రీచ్‌లు ప్రారంభిస్తామని వీటితో పాటు మరికొన్ని చోట్ల ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసేందుకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించేందుకు మైనింగ్‌శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. నది నుంచి టైరు బండ్ల ద్వారా ఇసుకను తీసుకునేందుకు ఉన్నతాధికారుల నుంచి అనుమతి రావాల్సి ఉందన్నారు. నూతన ఇసుక పాలసీ నియమ నిబంధనలు వివరించారు. తహసీల్దార్లు మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, నెహ్రూబాబు, నాంచారయ్య, నిరంజన్‌బాబు, సీహెచ్ పద్మావతి, షాకీర్‌పాషా, ఎంపీడీవోలు శోభారాణి, సుధారాణి, అనురాధ, రవిబాబు, చంద్రశేఖర్, సీఐలు సురేష్‌బాబు, మల్లికార్జనరావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో హెలాషారోన్

పట్టుమని పదడుగులు మిగల్లేదు

కోతకు గురవుతున్న కాలువ కట్టలు

నగరం, న్యూస్‌టుడే: వైకాపా హయాంలో నాయకులు, అధికారుల స్వార్థానికి కాలువ కట్టలు కనుమరుగయ్యాయి. ఒకప్పుడు సుమారు వంద అడుగుల వెడల్పున్న కాలువ కట్టలు పట్టుమని పదడుగులు మిగల్లేదు. మండల పరిధిలో కారంకివారిపాలెం, మాన్యంవారిపాలెం గ్రామాల మధ్యలో రేపల్లె మెయిన్ డ్రెయిన్ కాలువ కట్ట నాలుగైదు చోట్ల కోతకు గురైంది. కారంకివారిపాలెం, మాన్యంవారిపాలెం, కాపులపాలెం, అద్దంకివారిపాలెం, వీరంకివారిపాలెం, ధూళిపూడి తదితర గ్రామస్థులు ఈ కాలువ కట్టపై నిర్మించిన రోడ్డు మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. కట్టల మట్టిని నాయకులు కొల్లగొట్టడంతో చాలా చోట్ల బలహీనమయ్యాయి. కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చకుంటే రోడ్డు కుంగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానిక గ్రామస్థులు భయపడుతున్నారు. రెండ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కట్టలు ఎక్కడ తెగుతాయోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కాలువ కట్టలను పటిష్ఠం చేయాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. కోతకు గురైన ప్రాంతాలను పూడ్చాలన్నా పార మట్టి అందుబాటులో లేకపోవడం నేతల దోపిడీకి అద్దం పడుతోంది.


నగరం ఎస్టీ కాలనీ సమీపంలో రేపల్లె మెయిన్ డ్రెయిన్ కాలువ కట్టకు కోత

జలవనరులశాఖలో బదిలీలు

ఈనాడు- బాపట్ల : జలవనరులశాఖలో పర్యవేక్షక ఇంజినీర్లు, కార్యనిర్వాహక ఇంజినీర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో లింగంగుంట్ల పర్యవేక్షక ఇంజినీరుగా ఉన్న వరలక్ష్మిని ఒంగోలు జలవనరులశాఖ సర్కిల్ ఎస్ఈగా బదిలీ చేశారు. కావలిలో పని చేస్తున్న కృష్ణమోహన్‌ను సాగర్ కుడికాలువ పరిధిలో లింగంగుంట్ల డివిజన్ మానిటరింగ్ ఈఈగా బదిలీపై వస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా చిన్న నీటిపారుదలశాఖ కార్యనిర్వాహక ఇంజినీరుగా కల్లూరి రమేష్ పాడేరు నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పోస్టు ఖాళీగా ఉండటంతో దుగ్గిరాల డీఈ ప్రసాద్ ఇన్‌ఛార్జి కార్యనిర్వాహక ఇంజినీరుగా పని చేశారు. గతంలో ఇక్కడ కార్యనిర్వాహక ఇంజినీరుగా ఉన్న రమేష్‌ను వైకాపా ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధికి అనుకూలంగా చేయలేదనే కారణంతో ఇక్కడి నుంచి పాడేరుకు బదిలీ చేశారు. తాజా బదిలీల్లో రమేష్ గుంటూరు సర్కిల్‌లో కార్యనిర్వాహక ఇంజినీరుగా వచ్చారు. అదేవిధంగా కృష్ణా పశ్చిమ డెల్టాలో తెనాలి కార్యనిర్వాహక ఇంజినీరుగా పనిచేస్తున్న మల్లికార్జున కర్నూలు జిల్లాలోని శ్రీశైలం ప్రాజెక్టుకు బదిలీపై వెళ్లారు. రేపల్లె మురుగునీటిపారుదల విభాగంలో కార్యనిర్వాహక ఇంజినీరుగా పనిచేస్తున్న వెంకటరత్నంను కృష్ణా పశ్చిమ డెల్టాలో తెనాలి ఈఈగా బదిలీపై వస్తున్నారు. విజయవాడ ముఖ్య ఇంజినీరు కార్యాలయంలో పనిచేస్తున్న శ్యాంప్రసాద్‌ను గుంటూరులోని గేజింగ్ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో పనిచేస్తున్న శివరాంప్రసాద్ గుంటూరులోని పులిచింతల ప్రాజెక్టు డివిజన్-4కు బదిలీపై వస్తున్నారు.

గుంతల్లో నీరు.. పడకేసిన మగ్గాలు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను అధిక వర్షాలు కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికుల పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతోంది. గతంలో కురిసిన వర్షాల దెబ్బకు కోలుకుంటున్న చేనేత కార్మికులను రెండ్రోజులుగా కురిసిన భారీ వర్షాలు మరింత కష్టాల్లోకి నెట్టాయి. మండలంలో ఐలవరం, భట్టిప్రోలు విరలేశ్వరనగర్ ప్రాంతాల్లో చేనేత కార్మికుల మగ్గాల గుంతల్లోకి నీరు చేరింది. అధిక వర్షం పడటంతో మగ్గాలు మూతపడ్డాయి. మూడ్రోజులుగా పనులు కోల్పోయామని కార్మికులు గుంతల్లోకి చేరిన నీరు తగ్గాలంటే వారం సమయం పడుతుందని, మగ్గాలకు ఉన్న చిలపనూలు దెబ్బతిని మరింత నష్టపోతామని పేర్కొంటున్నారు. రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.


మగ్గం గుంతలోకి చేరిన నీరు

మెప్మా సీవో పోస్టు భర్తీ రచ్చ రచ్చ

పీడీ కార్యాలయానికి చేరిన పంచాయితీ

బాపట్ల, న్యూస్‌టుడే: బాపట్ల మెప్మా సీవో పోస్టు భర్తీ విషయంలో రచ్చ జరుగుతోంది. అయిదేళ్లుగా పని చేస్తుండటంతో ఇప్పటికే ఇద్దరు సీవోలను బదిలీ చేశారు. బదిలీపై వచ్చిన సీవోల్లో ఒకరిపై వైకాపా సానుభూతిపరులు అనే ముద్ర ఉంది. మూడో సీవో బదిలీ కావాల్సి ఉంది. సదరు సీవో వైకాపా వీర విధేయుడు. సామాజిక మాధ్యమాల్లో వైకాపాకు అనుకూలంగా, తెదేపాకు వ్యతిరేకంగా పలుమార్లు పోస్టులు పెట్టాడు. బాపట్ల మెప్మా విభాగంలో నకిలీ పొదుపు సంఘాలు, బినామీ పేర్లతో రూ.కోట్లు స్వాహా చేసిన వ్యవహారంలో అతని పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుంటూరు జిల్లా మెప్మా పీడీనే బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి పీడీగా ఉన్నారు. మెప్మా పీడీ కార్యాలయంలో సీవో తన పరపతిని ఉపయోగించి తాత్కాలికంగా తన బదిలీ జరగకుండా అడ్డుకున్నారు. కొందరు నాయకుల ద్వారా బాపట్లలోనే కొనసాగేలా సిఫార్సులు చేయించుకుంటూ తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. బాపట్లలో మూడో సీవో పోస్టు కోసం మరొకరు ప్రజాప్రతినిధి ద్వారా సిఫార్సు లేఖ తీసుకుని ప్రయత్నాలు ప్రారంభించారు. వైకాపా మద్దతుదారుడిగా ఉన్న సీవోను ఎలా కొనసాగిస్తారని పోస్టు కోసం ప్రయత్నిస్తున్న రెండో వర్గం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. రెండు వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. బదిలీ దస్త్రం గుంటూరులోని పీడీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. తనకు మద్దతుగా ఉన్న నాయకులతో కలిసి పీడీ కార్యాలయానికి సీవో గురువారం వెళ్లి హంగామా చేశాడు. ఎవరిని బదిలీ చేయాలన్న విషయంపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుత పీడీ సైతం మరో ఆరు రోజుల్లో బదిలీ కానున్నారు. సీవో పోస్టు ఎవరికి దక్కుతుందా? అని మెప్మా వర్గాలు ఆసక్తిగా చూస్తున్నాయి.

మెప్మా సీఎంఎంగా సుబ్రహ్మణ్యం

బాపట్ల: పురపాలక సంఘంలో మెప్మా విభాగం సిటీ మిషన్ మేనేజర్ (సీఎంఎం)గా ఎన్.సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. చీరాల పురపాలక సంఘం నుంచి ఆయన బదిలీపై బాపట్ల వచ్చారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన హనుమా నాయక్ పొన్నూరు పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు.

ఆక్వా పార్కుకు తొలగిన అడ్డంకి

★ మత్స్యశాఖకు 193 ఎకరాలు కేటాయింపు
★ పర్యాటక రంగానికి 50 ఎకరాలు
★ మడ అడవుల భూమి మినహాయింపు

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో నిజాంపట్నం మండలం దిండి వద్ద నిర్మించ తలపెట్టిన ఆక్వా పార్కు నిర్మాణానికి ఏడాదిన్నరగా నెలకొన్న అడ్డంకిని తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తొలగించింది. భూకేటాయింపులో తలెత్తిన సాంకేతిక సమస్యను పరిష్కరించింది. సమీకృత ఆక్వా పార్కు ప్రాజెక్టు నుంచి మడ అడవులను మినహాయించి 193 ఎకరాల భూమిని మత్స్యశాఖకు కేటాయించింది. పర్యాటరంగ అభివృద్ధి కోసం మరో 50 ఎకరాలు కేటాయించారు. త్వరలో నిర్మాణ పనులకు టెండర్ పిలిచి సీఎం చంద్రబాబు చేతుల మీదగా శంకుస్థాపన చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



ఆక్వా పార్కు కోసం దిండి వద్ద కేటాయించిన భూమి

వైకాపా పాలనలో శంకుస్థాపనకు పరిమితం

జిల్లా ప్రగతికి ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టుల్లో సమీకృత ఆక్వా పార్కు ఒకటని ప్రభుత్వం గుర్తించింది. గత వైకాపా పాలనలో దిండి వద్ద ఆక్వా పార్కు నిర్మాణానికి రూ.88.08 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటా రూ.52.85 కోట్లు కాగా రాష్ట్ర ప్రభుత్వం రూ.35.23 కోట్లు ఇవ్వాల్సి ఉంది. 2023 మే 16న దీని నిర్మాణ పనులకు అప్పటి సీఎం జగన్ నిజాంపట్నం సభలో శంకుస్థాపన చేశారు. 280 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇందులో 37 ఎకరాల మడ అడవి ఉండటంతో పర్యావరణపరమైన సమస్యలు తలెత్తాయి. పర్యాటక శాఖకు 50 ఎకరాలు కేటాయించాలని నిర్ణయించారు. పార్కుకు కేటాయించిన భూమి రెవెన్యూ రికార్డుల్లో బంగాళాఖాతం అని ఉండటంతో సాంకేతికంగా సమస్య ఏర్పడింది. వైకాపా ప్రభుత్వం ఈ సమస్య పరిష్కరించకపోవటంతో నిర్మాణ పనులకు టెండర్ పిలవలేదు. ఏడాది పైగా కాలం గడిచిపోయింది.

మంత్రి అనగాని చొరవతో..

తెదేపా నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే ప్రాజెక్టు ఆవశ్యకతను గుర్తించింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక చొరవ తీసుకుని 280 ఎకరాల్లో మడ అడవులు ఉన్న 37 ఎకరాలను ప్రాజెక్టు నుంచి మినహాయించారు. పర్యాటక శాఖకు 50 ఎకరాలు ఇచ్చి ఆక్వా పార్కు నిర్మాణానికి 193 ఎకరాలు మత్స్యశాఖకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేయించారు. ప్రాజెక్టులో ఆక్వా రంగానికి సంబంధించి నూతన అంశాలను చేర్చుతూ నిర్మాణ వ్యయాన్ని రూ.187.75 కోట్లకు ప్రభుత్వం పెంచింది. కేంద్రం తన వాటా కింద రూ.112.65 కోట్లు మంజూరు చేయటానికి అంగీకారం తెలిపింది. మిగిలిన రూ.75.10 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. భూ సమస్య పరిష్కారం కావటంతో నిర్మాణ పనులకు టెండర్లు పిలిచేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

దేశంలోనే ప్రథమం

దేశంలోనే తొలి సమీకృత ఆక్వా పార్కు నిర్మాణం పూర్తయితే నాణ్యమైన పండుగప్ప, పీతలు, రొయ్య పిల్లలు జిల్లాలో రైతులకు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటి వరకు పిల్లల కోసం రైతులు తమిళనాడులోని చెన్నై, రామేశ్వరం వెళ్తున్నారు. ఇక నుంచి అంత దూరం వెళ్లాల్సిన అవసరం ఉండదు. రంగు చేపల పెంపంపై శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి మత్స్యకార మహిళలు, స్థానిక మహిళలకు శిక్షణ ఇచ్చి వీటి విక్రయం ద్వారా స్వయం ఉపాధి పొందేలా తోడ్పాటునందిస్తారు. సీవీడ్ పెంపకంపైనా శిక్షణ ఇవ్వనున్నారు. ప్రాసెసింగ్ యూనిట్లు నిర్వహించి జిల్లాలో పలుచోట్ల ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తారు.

త్వరలో టెండర్లు పిలుస్తాం

ఆక్వా పార్కు నిర్మాణానికి మత్స్యశాఖకు రెవెన్యూ శాఖ భూమి కేటాయించింది. నిర్మాణ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం. జిల్లా అభివృద్ధికి దీనిని అత్యంత ప్రాధాన్యత ప్రాజెక్టుగా గుర్తించాం. ఆక్వా రంగం మరింత ప్రగతి సాధిస్తుంది. - సురేష్, జేడీ, మత్స్యశాఖ

ఎలుక.. ఎంత పనిచేసింది!

చినగంజాం, న్యూస్‌టుడే: ఓ ఎలుక చేసిన పనికి మూడు గ్రామాల ప్రజలు పది గంటలకుపైగా విద్యుత్తు లేక ఇబ్బంది పడ్డారు. కొత్తపాలెం విద్యుత్తు ఉప కేంద్రంలోని ఎల్వీబ్రేకర్ (లింబు, ఎల్వీసీటీ)లోకి గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఎలుక చొరబడటంతో పెద్దగా మంటలు వచ్చి కాలిపోయింది. ఫలితంగా చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిందని మండల ట్రాన్స్‌కో ఏఈ పడవల గణనారాయణ తెలిపారు. ఎల్వీబ్రేకర్ కాలిపోవడంతో ఏర్పడిన సాంకేతిక లోపాన్ని సరిదిద్దడానికి ఒంగోలు నుంచి ప్రొడక్షన్ ఏఈ జబ్బార్, సిబ్బంది వచ్చి మరమ్మతులు చేశారు. రాత్రి 11 గంటలకు కరెంటును పునరుద్ధరించారు. పనులను వేటపాలెం ఏడీఈ శ్రీనివాసులు పర్యవేక్షించారు.



మంటలు వచ్చి కాలిపోయిన ఎల్వీబ్రేకర్

సీఎం సహాయనిధితో పేదల ఆరోగ్యానికి సహకారం

అద్దంకి, జే పంగులూరు, బల్లికురవ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయనిధితో పేదల ఆరోగ్యానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. చిలకలూరిపేటలోని ఆయన స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన ఐదుగురికి రూ.25.84 లక్షల విలువైన ముందస్తు వైద్య ఖర్చుల అనుమతి పత్రాలు(ఎల్‌ఓసీ) అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత తెదేపా ప్రభుత్వంలో మాత్రమే నియోజకవర్గ స్థాయిలో ఎంతోమంది పేదలకు మోకాళ్ల శస్త్రచికిత్సకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందించామన్నారు. గడిచిన వైకాపా ప్రభుత్వంలో ఒక్క ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు మోకాళ్ల శస్త్రచికిత్సకు ఇవ్వలేదని గుర్తు చేశారు. అద్దంకి మండలం కుంకుబాడు గ్రామానికి చెందిన అనపర్తి మరిదం కాలేయ మార్పిడికి రూ.15 లక్షలు, జే పంగులూరు మండలం భగవాన్ రాజుపాలేనికి చెందిన రావిపాటి వీరాంజనేయులు మోకీలు మార్పిడికి రూ.2,17,200, బల్లికురవకు చెందిన పెంట్యాల సుబ్బారావు మోకాలి శస్త్రచికిత్సకు రూ.2,17,200, సంతమాగులూరు మండలం చవిటిపాలేనికి చెందిన రావూరి అరవింద్ నడుము శస్త్రచికిత్సకు రూ.2.50 లక్షలు, తంగేడుమల్లికి చెందిన ఎం.వీరాంజనేయులు శస్త్రచికిత్సకు రూ.4 లక్షలు కేటాయిస్తూ ముందస్తు అనుమతి పత్రాలు అందజేశారు.



కుంకుబాడుకు చెందిన మరిదంనకు ముఖ్యమంత్రి సహాయనిధి లేఖ అందిస్తున్న మంత్రి గొట్టిపాటి

ఒంటరి వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో ఒంటరి మహిళలు, వృద్ధుల భద్రతపై సీఐలు, ఎస్సైలు ప్రత్యేక దృష్టిసారించాలని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ, పోక్సో, ఇతర పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. రాత్రిళ్లు మరింత సమర్థవంతంగా గస్తీ నిర్వహించాలని చెప్పారు. బహిరంగంగా మద్యం తాగే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వారిపై నిఘా ఉంచాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చోరీలు, రోడ్డు ప్రమాదాలు, నేరాలను నివారించాలన్నారు. చోరీ కేసుల్లో వేగంగా రికవరీలు చేయాలని చెప్పారు. వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలని, ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేసిన బాపట్ల పట్టణ సీఐ అహ్మద్ జానీ, నేరాల కేసులను ఛేదించిన మార్టూరు సీఐ శేషగిరిరావు, అమృతలూరు సీఐ అమర్‌వర్ధన్‌లకు ఎస్పీ ప్రశంసపత్రాలు అందించి అభినందించారు. అదనపు ఎస్పీ విఠలేశ్వర్, డీఎస్పీలు మురళీకృష్ణ, రామాంజనేయులు, జగదీష్‌నాయక్, చంద్రమోహన్, ఎస్బీ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు నారాయణ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ తుషార్ డూడీ నుంచి ప్రశంసపత్రం అందుకుంటున్న బాపట్ల పట్టణ సీఐ అహ్మద్ జానీ, మార్టూరు సీఐ శేషగిరిరావు, అమృతలూరు ఎస్సై అమర్‌వర్ధన్

వైకాపా జిల్లా అధ్యక్షుడిగా మేరుగ నాగార్జున

బాపట్ల, న్యూస్‌టుడే: వైకాపా జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి మేరుగ నాగార్జునను ఆ పార్టీ అధినేత వై.ఎస్ జగన్ నియమించారు. బాపట్ల పార్లమెంటు పార్టీ పరిశీలకుడిగా మాజీ ఎంపీ నందిగం సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు వైకాపా కేంద్ర కార్యాలయం గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2019 ఎన్నికల్లో వేమూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నాగార్జున ఎమ్మెల్యేగా గెలిచారు. జగన్ మంత్రివర్గంలో 2021 నుంచి 2024 వరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామంత్రిగా పని చేశారు. గత ఎన్నికల్లో ప్రకాశం జిల్లా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన మేరుగ ఓటమి పాలయ్యారు. సంతనూతలపాడు బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఉంది.



కరణం కాదనటంతో.. ఇటీవల తాడేపల్లిలోని జగన్ నివాసంలో జిల్లా నేతలతో నిర్వహించిన సమావేశంలో చీరాల వైకాపా బాధ్యుడు కరణం వెంకటేష్‌ను జిల్లా పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించాలని అధినేత కోరారు. రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన తాను కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నానని కొంత కాలం విశ్రాంతి తీసుకోవాల్సి ఉందని ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించారు. ఈ నేపథ్యంలో వైకాపా జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి తనయుడు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డిని నియమించాలని భావించి మధుకు సమాచారం ఇచ్చారు. ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి వర్గీయులు తాడేపల్లి వెళ్లి సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర పెద్దలను కలిశారు. మధుసూదనరెడ్డికి అధ్యక్ష పదవి ఇవ్వరాదని పట్టుబట్టారు. కోన రఘుపతికి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని కోరారు. చివరకు మేరుగ నాగార్జునకు జిల్లా అధ్యక్ష పదవిని అధిష్ఠానం కట్టబెట్టింది.

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో పోస్టుల భర్తీ

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన సిబ్బంది పోస్టులను ఒప్పంద ప్రాతిపదికన, బోధనేతర సిబ్బందిని పొరుగు సేవల కింద ఏడాది కాలానికి నియమిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు జిల్లా సమన్వయకర్త లక్ష్మీకుమారి తెలిపారు. అర్హులు, ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు ఏపీకేజీబీవీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తులను అక్టోబరు 10లోగా అందజేయాలన్నారు. వయోపరిమితి ఓపెన్ కేటగిరీ అభ్యర్థులకు 18-42ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అయిదేళ్లు, మాజీ సైనికోద్యోగులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపు ఉంటుందని తెలిపారు.

నియంత్రిక.. సిమెంట్ వరలపై అమరిక

కొమ్మాలపాడు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: కొమ్మాలపాడు సినిమా థియేటర్ వద్ద ఉన్న నియంత్రికను బిగించిన విద్యుత్తు స్తంభాలు రెండు వైపులా ఒక వైపునకు విరిగిపోయి మరో వైపునకు వాలిపోయాయి. గాల్లో వేలాడుతున్న విద్యుత్తు ఊయలలా ప్రమాదకరంగా మారింది. దీనిపై 'ఈనాడు'లో 'గట్టిగా గాలి వీస్తే... అంతే సంగతులు' శీర్షికతో ఈనెల 25న ప్రచురితమైన కథనానికి విద్యుత్తు ఏఈ దీపక్‌రెడ్డి స్పందించారు. గాలిలో ఊగిసలాడుతున్న స్తంభాలను తొలగించారు. నియంత్రికను సిమెంట్ వరలపై అమర్చి సమస్యను పరిష్కరించారు.

ఈనాడు కథనానికి స్పందన



సిమెంట్ వరలపై అమర్చిన నియంత్రిక

ఓలేరులో రోడ్డెక్కిన టైరు బళ్ల యజమానులు

ఇసుక తరలింపునకు అనుమతించాలని డిమాండ్

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలో ఓలేరు ఇసుక రీచ్ నుంచి టైరు బళ్లలో ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వాలంటూ వెల్లటూరు-పెనుమూడి రహదారిపై ఓలేరు వద్ద టైరుబళ్లతో యజమానులు గురువారం రాస్తారోకోకు దిగారు. టైరుబళ్లను ఎడ్లతో సహా రహదారిపై ఉంచి బైఠాయించారు. అక్రమంగా ట్రాక్టర్లతో ఇసుక తరలివెళుతుంటే పట్టించుకోని అధికారులు జీవనాధారం కోసం టైరుబళ్లతో ఇసుక తీసుకెళుతుంటే అడ్డుకోవటం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం ప్రకటించినా అధికారుల ఆంక్షలు ఏమిటని ప్రశ్నించారు. రెండు గంటలకు పైగా రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ స్తంభించింది. అధికారులు వచ్చి తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు విరమించేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న పోలీసులు టైరుబళ్ల యజమానులతో మాట్లాడారు. కలెక్టరు అనుమతి లేదని చెప్పినా వారు పట్టించుకోలేదు. ఎట్టకేలకు ఇసుక తీసుకునేందుకు అధికారులు అనుమతించడంతో ఆందోళన విరమించారు.



టైరుబళ్లతో రాస్తారోకో చేస్తున్న యజమానులు

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: మండలంలో బేతపూడి నుంచి పల్లెకోన వెళ్లే రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న కేసులో ప్రధాన నిందితుడు కలగంట్ల భానుప్రకాష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత నెల 24న గంజాయి విక్రయించే ముఠాలో ఆరుగురు నిందితులను అరెస్టు చేశామన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న భానుప్రకాష్‌ను ఎట్టకేలకు పట్టుకున్నామని తెలిపారు. గంజాయి వినియోగం, విక్రయంపై వెంటనే 9440796169 సమాచారం ఇవ్వాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గన్నవరంలో ఘోర రోడ్డు ప్రమాదం

★ సంఘటన స్థలంలో ఇరువురు, చికిత్స పొందుతూ ఒకరి మృతి
★ మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

గన్నవరం గ్రామీణం, జే పంగులూరు, న్యూస్‌టుడే: చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై కృష్ణా జిల్లా గన్నవరం శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా జే.పంగులూరు మండలం కోటపాడుకు చెందిన పల్లెపోగు ప్రేమమ్మ(45) క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆమె చికిత్స నిమిత్తం ఈ నెల 24న భర్త ఆదాం, వరుసకు కొడుకు అయిన పల్లెపోగు మురారీ, బంధువులైన ఆరికట్లవారిపాలేనికి చెందిన కూరగంటి మార్క్(25), కొండమంజులూరుకు చెందిన పోలేపోగు మేరీ(40) కారులో విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. ఆసుపత్రిలో చూపించుకొని బుధవారం తిరుగు ప్రయాణమవ్వగా గురువారం అర్ధరాత్రి 02.30 గంటలకు మార్గమధ్యలోని గన్నవరం చేరుకున్నారు. స్థానిక భారత్ పెట్రోల్ బంకు సమీపంలోకి చేరుకొనేసరికి కారు నడుపుతున్న పల్లెపోగు ఆదాం నిద్రమత్తులో ఒక్కసారిగా రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కూరగంటి మార్క్(25), పోలేపోగు మేరీ(40) అక్కడికక్కడే మృతిచెందగా.. ఆదాం, ప్రేమమ్మ, మురారీలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు పోలీసుల సాయంతో క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రేమమ్మ చికిత్స పొందుతూ మరణించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మార్క్‌కు భార్య, ఒక బాబు సంతానం కాగా మేరీకి ముగ్గురు పిల్లలున్నారు.



మృతులు ప్రేమమ్మ, మార్క్, మేరి (పాత చిత్రాలు)

విద్యుదాఘాతంతో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ దుర్మరణం

చీరాల అర్బన్: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన రెండో పట్టణ పోలీసు స్టేషను పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బాపట్ల జిల్లా కర్లపాలెం సమీపంలో ఉన్న ముత్తాయిపాలేనికి చెందిన వెంకటస్వామి (35) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈనేపథ్యంలో కొత్తపేటలో గడిచిన పది రోజులుగా గుత్తేదారుడు వద్ద విద్యుద్దీకరణ పనులు చేస్తున్నారు. బుధవారం రాత్రి నియంత్రిక బిగించిన తరువాత స్తంభం ఎక్కి, మరమ్మతులు చేయడానికి ప్రయత్నించడంతో విద్యుదాఘాతానికి గురై, కిందపడిపోయారు. వెంటనే ఇతడ్ని స్థానిక వైద్యశాలలో చూపించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందడంతో కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక బాబు ఉన్నారు. వెంకటస్వామి ఒక్కడే ఆ కుటుంబానికి దిక్కు కావడంతో వారు అల్లాడిపోతున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ١కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 126, రిటైల్ ధర - 148, చికెన్ విత్‌స్కిన్ - 215, చికెన్ స్కిన్‌లెస్ - 244.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 248 చికెన్ స్కిన్‌లెస్ - 258.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 530 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.86/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి మరువలేనిది



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

భట్టిప్రోలు: తెలంగాణ ఉద్యమాల సమయంలో ఐలమ్మ చాటిన స్ఫూర్తి మరువలేనిది రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పోతార్లంక రాజేష్ అన్నారు. మండలంలో వెల్లటూరు రామమందిరం వద్ద ఐలమ్మ జయంతి పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారిణి వీరనారీగా బహుజనులకు నాంది పలికారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఐనాపురపు నాగేశ్వరరావు, చందోలు రవికుమార్, మున్నంగి సత్యనారాయణ, శివమణి, గోపీకృష్ణ పాల్గొన్నారు.

అక్టోబరు 3 నుంచి దసరా వేడుకలు

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని గుళ్లపల్లి శ్రీగంగాభిక సమేత ఆనందీశ్వర స్వామి ఆలయంలో అక్టోబరు 3 నుంచి 12 వరకు 48వ దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. ఈమేరకు కరపత్రాలను ఆలయం వద్ద ఆయన గురువారం ఆవిష్కరించారు. 3న గణపతి పూజ అనంతరం అమ్మవారు బాలత్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తారన్నారు. 4న మహాలక్ష్మీదేవి అలంకరణ, 5న మహాకాళి, 6న లలిత త్రిపురసుందరి, 7న అన్నపూర్ణాదేవి, 8న గాయత్రీదేవి, 9న మూలనక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని, సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఉంటుందన్నారు. 10న దుర్గాదేవిగా, 11న మహిషాసురమర్దినిగా, 12న విజయదశమి సందర్భంగా అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిస్తారన్నారు. అదే రోజు సాయంత్రం శమీపూజ ఉంటుందన్నారు. 13న స్వామి వారి శాంతి కల్యాణం బ్రహ్మశ్రీ సర్వ వెంకటశ్రీనివాసశర్మ, అర్చకస్వామి ప్రయాగ రాంబాబు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. తొమ్మిదిరోజులు నిత్యం స్వామికి ఉదయం, సాయంత్రం పంచామృత రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల: 80085 73141, రేపల్లె: 80085 73135, వేమూరు: 91107 837382

? చందోలు పెద్ద మసీదు వీధిలో సీసీ రహదారిపై మురుగునీరు నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారికి రెండు వైపులా కాల్వలు లేకపోవడంతో ఇళ్లలో నుంచి నిరంతరం రహదారిపైకి చేరుతోంది.
- మహమ్మద్ జానీ, చందోలు

✔ రహదారిని పరిశీలించి మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకుని, సమస్యను పరిష్కరిస్తాం.
- శేషగిరిరావు, కార్యదర్శి, చందోలు
- న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

? మండల కేంద్రమైన నిజాంపట్నంలో జెండా చెట్టు రోడ్డు నుంచి ఫిషర్‌మెన్ కాలనీకి వెళ్లే మార్గంలో సిమెంటు రోడ్డుకు ఇరువైపులా చెత్త చెదారం పేరుకుపోయింది. ఈ మార్గంలో నడవాలంటే దుర్వాసన వస్తోంది. పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సమస్య పరిష్కరించాలి.
- స్థానికులు, నిజాంపట్నం

✔ క్షేత్రస్థాయికి సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.
- ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి, నిజాంపట్నం
- న్యూస్‌టుడే, నిజాంపట్నం

? అమృతలూరులో పందుల సంచారంతో ప్రజలకు ఇబ్బందిగా ఉంటుంది. అసలే జ్వరాలతో బాధపడుతున్న తరుణంలో ఇలా పందులు తిరగడంతో అంటువ్యాధులు సోకుతాయని భయంగా ఉంది.
- స్థానికులు, అమృతలూరు

✔ పందులను గ్రామంలో వదలకూడదు. పెంపకందారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.
- మహబూబ్ సుభాని, ఎంపీడీవో
- న్యూస్‌టుడే, అమృతలూరు

? నగరం - రేపల్లె రహదారిలో శ్రీ వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాల ఎదురుగా వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రిళ్లు స్థానికులు రాకపోకలు నిర్వహించేందుకు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారిలో రెండు వైపులా ముళ్లపొదలు, పచ్చగడ్డి ఉండటం వల్ల విష పురుగులు రోడ్డుపై సంచారం చేస్తున్నాయి.
- పిన్నబోయిన శ్రీనివాస్, నగరం

✔ గ్రామంలో అన్ని రహదారుల్లో వీధి దీపాలు వెలిగేలా చూస్తాం. ప్రధాన రహదారిలో పోయిన దీపాలను గుర్తించి వాటిని తొలగించి కొత్త దీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- అనిల్‌కుమార్, కార్యదర్శి, నగరం - న్యూస్‌టుడే, నగరం



నగరం: కారంకివారిపాలెంలో ఇళ్లను చుట్టుముట్టిన వర్షం నీరు



నిజాంపట్నం: చెరువును తలపిస్తున్న సిమెంటు రహదారి

ముంచెత్తిన వర్షం

శివారు కాలనీ వాసులకు కష్టాలు

భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రెండ్రోజులుగా కురుస్తోన్న భారీ వర్షంతో శివారు కాలనీలు నీట మునిగాయి. భట్టిప్రోలులో చెరువు పొంగి విరలేశ్వరనగర్ జలదిగ్బంధంలో చిక్కింది. రహదారులు మొత్తం జలమయమయ్యాయి. గతంలో చెరువు పూడిక తీయించాలని కాలనీ వాసులు డిమాండు చేసినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. వర్షాకాలంలో కాలనీ వాసులకు కష్టాలు తప్పడం లేదు. కాలనీకి కనీసం కల్వర్టు డ్రెయిన్ సౌకర్యం కల్పించడంలో అధికారులు శ్రద్ధ తీసుకోవడం లేదు. గత ఎన్నికల సమయంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపడతామని అన్ని పార్టీల నాయకులు హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకున్నవారు కరవయ్యారు. నగరం మండల పరిధిలో పలు గ్రామాలు, శివారు కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దూళిపూడి ఎస్సీ కాలనీ, కారంకివారిపాలెం గౌడ, యాదవ కాలనీలు, నగరం ఎస్సీ కొత్త కాలనీ, పూడివాడ పడమటిపాలెం, చినమట్లపూడి, సిరిపూడి, పెద్దవరం ఎస్సీ కాలనీల్లో వర్షం నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంతర్గత రహదారులు, ప్రధాన రహదారులు వర్షం నీటితో నిండి పంట కాలువలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, గృహాలను వర్షం నీరు చుట్టేసింది. అంతర్గత రహదారుల్లో మురుగు కాలువలు నిర్మించక పోవడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నిజాంపట్నం మండలంలోనూ ఇదే పరిస్థితి.



నగరం: కాలువను తలపిస్తున్న చినమట్లపూడి ప్రధాన రోడ్డు



నగరం: మోకాళ్ల లోతు నీటితో సచివాలయంలో నీటిని బయటకు పంపుతున్న సిబ్బంది



భట్టిప్రోలు: విరలేశ్వరనగర్‌కు ఈ నీటిలో వెళ్లాల్సిందే..

ప్రాయశ్చిత్త దీక్షకు సంఘీభావం



రేపల్లె: సంఘీభావ యాత్రలో కూటమి నేతలు, తదితరులు

బాపట్ల, రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసేలా గత వైకాపా ప్రభుత్వం, టీటీడీ పాలకమండలి ఘోర తప్పిదానికి పాల్పడిందని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ అన్నారు. లడ్డూ ప్రసాదం అపవిత్రం అయినందుకు క్షమాపణ కోరుతూ జనసేన, భాజపా నేతలు స్థానిక పాత బస్టాండ్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో 11 రోజుల ప్రాయశ్చిత్త దీక్ష గురువారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తప్పు చేసిన వారికి వెంకటేశ్వర స్వామి తగిన శిక్ష విధిస్తారన్నారు. భాజపా నేత కోట్రా రామకృష్ణ, జనసేన నేతలు గంటా నాగమల్లేశ్వరరావు, విష్ణుమొలకల చంద్రమోహన్, పడమటి దుర్గారావు, చిల్లా సత్యనారాయణ, విజయ మాదిరి, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా కూటమి నాయకుల ఆధ్వర్యంలో రేపల్లె పట్టణంలో సంఘీభావ యాత్ర గురువారం నిర్వహించారు. పెద కూరగాయల మార్కెట్ సమీపంలో వినాయకుని గుడి నుంచి రింగురోడ్డు, ఎన్టీఆర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఉప్పూడి రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు ప్రదర్శన నిర్వహించారు. స్వామి వారికి పూజలు చేసి ప్రసాదం పంపిణీ చేశారు. కూటమి నేతలు అనగాని శివప్రసాద్, రాంబొట్ల మహేష్, అన్నం సాయివరప్రసాద్, దేవరి శంకర్, రంగారావు, సత్యనారాయణ, సాంబశివరావు, లక్ష్మీశ, సుబ్రహ్మణ్యం, సీవీ మోహనరావు, అగస్త్య తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల: దీక్ష స్వీకరించిన జనసేన, భాజపా నేతలు

దమ్మనవారిపాలెంలో.. కర్లపాలెం: తిరుమల లడ్డూ కల్తీపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా దమ్మనవారిపాలెం రామాలయంలో జనసేన నేతలు ప్రత్యేక పూజలు చేసి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడటం దారుణమని నేతలు పేర్కొన్నారు. నేతలు మాదాసు బాలాజీ, గొట్టిపాటి శ్రీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మహా అపరాధం మన్నించరూ!

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే : తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో వెదుళ్లపల్లి శంకర్ విద్యాలయంలో వేద విద్యార్థులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పాఠశాల అవధాని కొర్నేపాటి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో చివుకుల దుర్గాప్రసాద శాస్త్రి పర్యవేక్షణలో పురుష, శ్రీసూక్త విరజా హోమాలు నిర్వహించారు. మహా అపరాధాన్ని క్షమించాలని కోరుతూ ఈ హోమాల్లో స్వామికి పూజలు చేశారు.



హోమం నిర్వహిస్తున్న వేద విద్యార్థులు

ప్లాస్టిక్ వ్యర్థాలతో తీవ్ర కాలుష్యం

బాపట్ల, వేమూరు, చెరుకుపల్లి, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్యం తీవ్రమై మానవాళి మనుగడకే ముప్పు ఏర్పడుతుందని వక్తలు అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బాపట్ల రథంబజారులో పురపాలక అధికారులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కమిషనర్ ప్రసన్నకుమార్ గురువారం ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. బాపట్ల ఫార్మసీ కళాశాల, ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల, ఎన్టీఆర్ ఏజీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే ముప్పుపై విద్యార్థులు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ టీఈ గోపాలకృష్ణమూర్తి, ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఏడీ ఎంఎస్ బేగ్ మాట్లాడారు. వేమూరు మండలంలో వేమూరు - చావలి అడ్డరోడ్డు నుంచి తపాలా కార్యాలయం మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. మురుగునీటి కాల్వల్లో పూడిక తీయించారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా చెరుకుపల్లి మండలం కావూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మండలంలోని 16 పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి షాలేహాజుబే, ల్యాబ్ టెక్నీషియన్ జె.విజయశాంతి, హెచ్ఈ అరుణ, ఏఎన్ఎంలు సరిత, ప్రసన్న వైద్యసేవలు అందించగా ఈవోపీఆర్డీ సునీత, పంచాయతీ కార్యదర్శి టి.మురళీకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పరిహారం మంజూరుతో బ్యాంకుల్లో సందడి

కొల్లూరు, న్యూస్‌టుడే: కృష్ణానది వరదల్లో నివాసాలు, పంటలు ముంపునకు గురై నష్టపోయిన బాధితులకు పరిహారాన్ని ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో ఈ సొమ్ము కోసం మండలంలోని బ్యాంకుల ముందు బాధితులు గురువారం బారులు తీరారు. దీంతో బ్యాంకులన్నీ ఖాతాదారులతో కిక్కిరిశాయి. ఇదిలా ఉంటే తమ నివాసాలు వరద ముంపునకు గురైనా నష్టపోయిన వారి జాబితాలో తమ పేర్లు లేవని, తమకు పరిహారం అందలేదంటూ మండలంలో పలు గ్రామాల నుంచి బాధితులు తహసీల్దార్ కార్యాలయానికి క్యూ కట్టారు. ముఖ్యంగా తిప్పలకట్ట, జువ్వలపాలెం శివారు కొత్తగూడేనికి చెందిన సుమారు 50 మంది మహిళలు ప్రజాసంఘాల నాయకులు తోడేటి సురేష్, పంతగాని నాగమల్లేశ్వరరావు నేతృత్వంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. దోనేపూడిలోని శ్రీ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులోని తమ ఖాతాల్లో జమ అయిన పరిహారం పొందేందుకు వీలు లేకుండా బ్యాంకు వారు తమ ఖాతాలను స్తంభింపజేశారని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావుకు తహసీల్దార్ ఫోన్ చేసి వరదల వల్ల నష్టపోయిన వారికి పరిహారం అందించాలని సూచించారు.



కొల్లూరు: పరిహారం అందించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

సాంకేతిక సమస్యలే కారణం.. మండలంలో వరదల వల్ల పంట నష్టపోయిన కొందరు రైతుల ఖాతాల్లో పరిహారం సాంకేతిక కారణాల వల్ల జమ కాలేదని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, ఉద్యానశాఖాధికారి కల్యాణ చక్రవర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బయోమెట్రిక్ విఫలం కావడం, ఇటీవల మంజూరైన ఆధార్ కార్డు నంబర్లు ఖాతాకు అనుసంధానం కాకపోవడం, పునరుద్ధరణ కాని ఆధార్ కార్డులు వంటి కారణాల వల్ల పరిహారం జమ కాలేదని వారు స్పష్టం చేశారు. ఈ విషయంలో లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వారి బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుని తద్వారా పరిహారం పొందాలని సూచించారు.

రైతుల హర్షం.. నగరం, చెరుకుపల్లి: పంట నష్ట పరిహారం రైతుల ఖాతాల్లో జమ కావడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగరం మండల పరిధిలో సుమారు 3,655 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అధికారులు గుర్తించారు. బుధవారం రాత్రి నుంచే ఖాతాల్లో నగదు జమ అవుతున్నట్లు ఏవో రమేష్ తెలిపారు. చెరుకుపల్లి మండలంలో 5090 మంది రైతులకు చెందిన 8027 ఎకరాల్లో వరదల కారణంగా నష్టం సంభవించగా రైతుల ఖాతాల్లో రూ.8,02,70,000 జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి టి.బాలాజీగంగాధర్ తెలిపారు. రోజుల వ్యవధిలోనే పరిహారం అందించటంపై ఆయా మండలాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిరస్మరణీయురాలు సరస్వతమ్మ

బాపట్ల, న్యూస్‌టుడే: బాలికా విద్య వ్యాప్తికి వెలగపూడి సరస్వతమ్మ ఎనలేని కృషి చేసి చిరస్మరణీయురాలిగా నిలిచారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధురాలు, తొలి బాలికా పాఠశాల వ్యవస్థాపకురాలు సరస్వతమ్మ వర్ధంతిని గురువారం నిర్వహించారు. సరస్వతి స్మారక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ బాపట్లలో 1915లో ఆమె ఏర్పాటు చేసిన బాలికా పాఠశాల 109 ఏళ్లలో ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల స్థాయికి చేరిందన్నారు. పాఠశాల హెచ్ఎం రమాదేవి, రచయిత్రి చిల్లర భవానీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం అభినందనీయం

బాపట్ల, న్యూస్‌టుడే: ఏవీవీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సాయం అభినందనీయమని పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్ అన్నారు. పాఠశాలలో పూర్వ విద్యార్థుల సహకారంతో విద్యార్థులు కూర్చోవటానికి స్టీల్ బెంచీలు ఏర్పాటు చేశారు. మౌలిక వసతులు మెరుగుపరిచిన తరగతి గదిని కమిషనర్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏవీవీ ఉన్నత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గంగాధర్, హెచ్.ఎం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



బెంచీలు పరిశీలిస్తున్న పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్




వేమూరు: పెనుమర్రులో గోడప్రతులు చూపుతున్న సర్పంచి సుమతి, అధికారులు



పి.వి.పాలెం: చందోలులో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

వంద రోజుల పాలనలో ప్రజలకు మేలు

బాపట్ల, కొల్లూరు, బాపట్ల పట్టణం, రేపల్లె అర్బన్, చందోలు (పిట్టలవానిపాలెం), వేమూరు, అమృతలూరు, న్యూస్‌టుడే: వంద రోజుల వ్యవధిలో ప్రజలకు ఎంతో మేలు చేకూర్చేలా సీఎం చంద్రబాబు పాలన అందించారని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పిట్టలవానిపాలెం మండలం చందోలులో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అఫ్జల్, గ్రామ కమిటీ అధ్యక్షుడు రంజాన్, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. బాపట్ల భీమావారిపాలెంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్ట పరిహారం, వరద సాయాన్ని 25 రోజుల్లోనే బాధితుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. ఆర్డీవో రవీందర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శివలీల, పురపాలక కమిషనర్ నిర్మల్‌కుమార్, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ, తెదేపా పట్టణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, భాజపా పట్టణాధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, కూటమి నేతలు భీమా లీలాకృష్ణ,



కొల్లూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

శీలం శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని చెరువుజమ్ములపాలెంలో పార్టీ మండల అధ్యక్షుడు సాంబశివరావు, నాయకుడు చెన్నుపాటి కిషోర్‌బాబు స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కొల్లూరు మండలం అనంతవరంలో ఎమ్మెల్యే ఆనంద బాబు మాట్లాడుతూ వంద రోజుల పాలనలోనే గత ప్రభుత్వంతో కూటమి ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని గమనించిన ప్రజలు తమకు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. స్థానికంగా డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాలను పరిశీలించి, గర్భిణులకు చీర, సారె అందించి ఆశీర్వదించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి పిచ్చిరెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ రావు, తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికారి ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదన్ ప్రసాద్, నాయకులు తూనుగుంట్ల సాయిబాబా, సర్పంచి అలపర్తి ఉషారాణి పాల్గొన్నారు. సభావేదికపై అకస్మాత్తుగా కొండముచ్చు ప్రత్యక్షమైంది. ఎమ్మెల్యేతో సహా వేదికపై ఉన్నవారితో పాటు సభికులు నిశ్చేష్టులయ్యారు. కొద్దిసేపటికి కిందకు దూకి ఎటో వెళ్లిపోయింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రేపల్లె పట్టణం 16, 17, 18, 19, 20, 21 వార్డులు, రూరల్ మండలం తుమ్మల, పోటుమెరక, నల్లూరునార్త్, అరవపల్లిలో తెదేపా నేతలు సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి స్టిక్కర్లు అంటించారు. వేమూరు మండలం పెనుమర్రులో అధికారులు, తెదేపా, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం గోడ ప్రతులను ఇంటింటికి తిరిగి ప్రజలకు అందజేశారు. అమృతలూరు గ్రామసచివాలయం వద్ద 'స్వర్ణ ఆంధ్రప్రదేశ్, ఇది మంచి ప్రభుత్వం, స్వచ్ఛతాహీ సేవా, మన ఇల్లు మన గౌరవం కార్యక్రమాలపై గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు నెహ్రూ బాబు 100 రోజుల సంక్షేమ పాలనను వివరించారు. సర్పంచి రాము పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత

బాపట్ల, ఖాజీపాలెం(పిట్టలవానిపాలెం), రేపల్లె అర్బన్: బాపట్ల, రేపల్లెలో ఆయా నియోజకవర్గాల స్థాయి అండర్-14, అండర్-17 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు గురువారం నిర్వహించారు. బాపట్ల పురపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 100, 200, 400, 800, 1500, 3వేల మీటర్ల పరుగు పందేల్లో అమ్మాయిలు, అబ్బాయిలు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజయం కోసం హోరాహోరీగా తలపడ్డారు. హైజంప్, లాంగ్‌జంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్‌త్రో విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతి విభాగంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులను జిల్లా పోటీలకు ఎంపిక చేసినట్లు క్రీడా పోటీల సమన్వయకర్త కత్తి శ్రీనివాసరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ కార్యదర్శి కరీముల్లా, మండల సమన్వయకర్తలు తిరుపతిరావు, రాంబాబు, ప్రశాంత్‌బాబు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 17 మంది క్రీడాకారులు నియోజకవర్గ జట్టుకు ఎంపికయ్యారు. క్రీడాకారులను విద్యా కమిటీ ఛైర్మన్ సాంబమూర్తిరాజు, ప్రధానోపాధ్యాయుడు భూపతిరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

✦ రేపల్లె మాంట్‌ఫోర్ట్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన పోటీలను ఎంఈవో సురేష్ ప్రారంభించి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత ఉంటుందన్నారు. ప్రతి విభాగంలో ప్రతిభ కనపర్చిన ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేశామని నియోజకవర్గ సమన్వయకుడు రమేష్‌బాబు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ బ్రదర్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, సుబ్బారావు, నాగబాబు, వీరాస్వామి, చైతన్య తదితరులు పోటీలు నిర్వహించారు. ఇక్కడ ప్రతిభ చాటిన వారు గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో త్వరలో జరగనున్న ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారు.



రేపల్లె: జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలతో ఉపాధ్యాయులు



రేపల్లె నియోజకవర్గం నుంచి ఆడే బాలురతో..



బాపట్ల నియోజకవర్గం క్రీడాకారులు వీరే..

వరద బాధితులకు చేయూత

కొల్లూరు, కర్లపాలెం, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన శ్రీ రాఘవేంద్ర బాల కుటీర్ విద్యార్థులు సేకరించిన రూ.1.20లక్షల విరాళాలను వెచ్చించి ఆ విద్యా సంస్థ నిర్వాహకులు మండలంలో తోకలవానిపాలెం శివారు కృష్ణనగర్, పోతార్లంక శివారు రావిలంకలో 85 మంది వరద బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, దుప్పట్లు గురువారం అందించారు. కార్యక్రమంలో విద్యాసంస్థ కరస్పాండెంట్ ప్రొఫెసర్ వెలుగూరి సుబ్బరాయుడు, ప్రిన్సిపల్ గీతాంజలి, కొల్లూరు వివేక విద్యా సంస్థ నిర్వాహకులు రామరాజు, వెంకటరత్నం, తోకలవానిపాలెం సర్పంచి కృష్ణమోహన్, ప్రజా నాట్యమండలి కార్యదర్శి చెన్నకేశవ పాల్గొన్నారు. కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం తెదేపా నేతలు రూ.35 వేల చెక్కును సీఎం సహాయనిధి కోసం ఎమ్మెల్యే నరేంద్రవర్మకు అందించారు. భట్టిప్రోలు మండలంలో వరద ప్రభావిత గ్రామాల్లోని ప్రైవేటు ఉపాధ్యాయులు 40మందికి మండలంలోని పెదలంకలో శ్రీసుధా గ్రూపు ఆఫ్ స్కూల్స్ సభ్యులు రూ.లక్షను గురువారం అందించారు. వివిధ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. కిష్కింధపాలెంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు అక్కడి ఉపాధ్యాయులు బ్యాగ్‌లు అందించారు. సర్పంచి నీలాంబరరావు పంపిణీ చేశారు.



కొల్లూరు: పోతార్లంకలో బాధితులకు నిత్యావసరాలు అందిస్తున్న విద్యాసంస్థ ప్రతినిధులు



భట్టిప్రోలు: నగదు అందిస్తున్న బృంద సభ్యులు

నేడు ఉద్యోగ మేళా

బాపట్ల, న్యూస్‌టుడే: ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ కోర్సులు చదివిన విద్యార్థులు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలన్నారు. ప్రైవేటు కంపెనీల్లో 85కు పైగా ఉద్యోగాలు భర్తీ చేసి విద్యార్హత ఆధారంగా వేతనం చెల్లిస్తారన్నారు.

పీసీసీ కార్యదర్శిగా వెంకటేశ్వరరావు

వేమూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా మండలంలో చావలికి చెందిన తాడికొండ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ఉద్యోగాలకు 54 మంది ఎంపిక

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె క్రైస్తవ ఐటీఐ కళాశాలలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. 100 మంది మౌఖిక పరీక్షకు హాజరు కాగా 54 మందిని వివిధ కంపెనీల ప్రతినిధులు ఎంపిక చేశారు. కరస్పాండెంట్ బిషప్ ఇమ్మానియేల్ రెబ్బా, ప్రిన్సిపల్ జాషువా రెబ్బా అధ్యాపకులు పాల్గొన్నారు.

చీరాల
• చీరాల • అద్దంకి • పర్చూరు

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా



కమిషనర్ రవీంద్రకు స్వాగతం పలుకుతున్న మేనేజరు శ్రీదేవి

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి పుర ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని కమిషనర్ డి.రవీంద్ర అన్నారు. గురువారం సాయంత్రం అద్దంకి పురపాలక కమిషనర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడారు. పురపాలక కమిషనర్‌గా నూజివీడు, వినుకొండ, తెనాలి, చిలకలూరిపేట, నరసరావుపేట, మార్కాపురంలో పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఒంగోలు నగరపాలక సంస్థలో సహాయ కమిషనర్‌గా పని చేస్తూ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రయత్నిస్తానన్నారు. నూతన కమిషనర్‌కు మేనేజరు శ్రీదేవి, సిబ్బంది అర్జునరావు తదితరులు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

29న చీరాలలో నేత్ర వైద్య శిబిరం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి, ప్రవాస భారతీయుడు చుండూరి నాగేశ్వరరావు లలిత దంపతుల సహకారంతో ఈనెల 29న ముంతావారి సెంటరులోని ఎన్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శ్రీరాం సురేష్ తెలిపారు. స్థానిక ఎంజీసీ మార్కెట్ వద్ద శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం విడుదల చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే శిబిరాన్ని చీరాల చుట్టుపక్కల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. శ్రీరాం వేణుగోపాల్, వేముల చంద్రశేఖర్, కోటా శ్రీమన్నారాయణ, మంచి కంటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం

పందిళ్లపల్లి(వేటపాలెం), న్యూస్‌టుడే: శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని డిప్యూటీ డీఈవో అబ్బరాజు శ్రీనివాసరావు, అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు నక్కల అర్జునరావు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ పాఠశాల ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి ఆటల పోటీలను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్ పోటీలు నిర్వహించారు. ఎంఈవో పురుషోత్తం, పూర్వ విద్యార్థుల సంఘ ప్రతినిధి ఉటూకూరి శ్రీమన్నారాయణ, ఎస్ఎంసీ ఛైర్మన్ చెరుకూరి రాంబాబు, ప్రధానోపాధ్యాయుడు శేఖరరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.



వేటపాలెం: రిబ్బను కత్తిరిస్తున్న డిప్యూటీ డీఈవో శ్రీనివాసరావు



ఇంకొల్లు: పోటీలు ప్రారంభిస్తున్న సమత

గంగవరం (ఇంకొల్లు), న్యూస్‌టుడే: క్రీడల్లో సత్తాచాటి జిల్లాకు మంచి పేరు తేవాలని ప్రధానోపాధ్యాయిని నార్నె సమత అన్నారు. గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పర్చూరు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలను గురువారం ఆమె ప్రారంభించారు. పోటీలు 14, 17 సంవత్సరాల కేటగిరీలో నిర్వహిస్తున్నారు. ఎంపికైన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారు. వ్యాయామోపాధ్యాయులు మధుమూర్తి, జయశంకర్, కోటేశ్వరరావు, సురేష్, వీరాస్వామి, శ్రీనివాసరావు, అమ్మయ్యచౌదరి పాల్గొన్నారు.

మేదరమెట్ల, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటే శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని సర్పంచి బొనిగల ఎలిశమ్మ అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్లలోని సెయింట్ ఆర్నాల్డ్స్ పాఠశాలలో గురువారం అద్దంకి నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో సమన్వయకర్త సుబ్బారావు, పీఈటీలు ఖాజావలి, సురేష్, శ్రీను, కల్యాణి, జ్వాలా, విద్యార్థులు పాల్గొన్నారు.



మేదరమెట్ల: పరుగు విభాగంలో పోటీ పడుతున్న విద్యార్థులు

ముగిసిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ



శిక్షణ పొందిన విద్యార్థులతో..

చీరాల, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన యూనెక్ట్ శిక్షణ గురువారంతో ముగిసింది. భారతీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంగ్లంపై పట్టు, జీవన నైపుణ్యాలు, నైతిక విలువలు, పబ్లిక్ స్పీకింగ్, ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలి, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలపై శిక్షణిచ్చారు. ముగింపు కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి కేంద్రం అధికారి తమ్మాజీరావు, డైరెక్టర్ ఎం.బ్రహ్మయ్య, ప్రిన్సిపల్ జైశంకర్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాగవెంకట్, సంజీవ్‌కుమార్, రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

పూసపాడు (ఇంకొల్లు), న్యూస్‌టుడే: గుంటూరు మానవత స్వచ్ఛంద సంస్థ పూసపాడుకు చెందిన పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేసింది. గ్రామానికి చెందిన వి.అఖిల నరసరావుపేట ఎంఏఎం కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు విద్యార్థినికి రూ.60వేల విలువచేసే ల్యాప్‌టాప్‌ను గురువారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. సాయికిరణ్, వేణుగోపాల్, చంద్రశేఖర్, పేరం శివాజీ, అమరయ్య, ఆనందరావు, కరణం రమేష్, సహదేవరావు, కృష్ణ, రామారావు, పూర్ణ పాల్గొన్నారు.

నేడు రైతులకు అవగాహన సదస్సు

మార్టూరు: మార్టూరు మండలం బొల్లాపల్లిలో శుక్రవారం వరి, మొక్కజొన్న రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల రైతుసంఘం నేత వీరవల్లి కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు, వ్యవసాయ ఉన్నతాధికారులు, గుంటూరు లాం శాస్త్రవేత్తలు విచ్చేస్తారని వెల్లడించారు.

ఐలమ్మ జీవితం ఈ తరానికి ఆదర్శం

అద్దంకి, న్యూస్‌టుడే: భూపోరాట యోధురాలు ఐలమ్మ జీవితం ఈ తరానికి ఆదర్శమని సాహితీ విశ్లేషకులు అన్నమనేని వెంకట్రావు అన్నారు. పట్టణంలో గురువారం ఐలమ్మ జయంతి నిర్వహించారు. మాజీ సర్పంచి చెన్నుపల్లి వెంకటేశ్వర్లు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, చెన్నుపాటి రామాంజనేయులు, విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతి రమేష్‌బాబు, చెన్నుపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ పార్వతమ్మకు నివాళి

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని వలపర్ల ఎం.ఎస్.ఆర్.జూనియర్ కళాశాలలో మాజీ ఎంపీ మాగుంట పార్వతమ్మ సంస్మరణ సభ గురువారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంత విద్యాసంస్థల ద్వారా మాజీ ఎంపీ అందిస్తున్న సేవలు గుర్తు చేసుకున్నారు. కళాశాల విద్యార్థినులు ఆమె చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచి జె.పూర్ణచంద్రరావు, నేతాజీ విద్యాసంస్థల డైరెక్టర్ సయ్యద్ కరీముల్లా, అధ్యాపకులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

బ్లీచింగ్ చల్లించారు

స్పందనకు వందనం

చినగంజాం, న్యూస్‌టుడే: సోపిరాల ఆర్చి దగ్గర మ్యాన్‌హోల్ వద్ద బురద వల్ల దోమల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పరిష్కరించాలని స్థానికులు సమస్యను 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. గురువారం ఫొటో వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన చినగంజాం గ్రామ కార్యదర్శి ఆళ్ల మస్తాన్‌రావు పంచాయతీ కార్మిక సిబ్బందిని సాయంత్రం పంపించి, మ్యాన్‌హోల్ వద్ద బ్లీచింగ్ చల్లించారు.

పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా పూజలు



పూజల్లో జనసేన నాయకులు

చినగంజాం, న్యూస్‌టుడే: సనాతన ధర్మ పరిరక్షణ కోసం తిరుపతి తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి గత ప్రభుత్వ హయాంలో జరిగిన అపచారానికి పరిహారంగా ప్రాయశ్చిత దీక్ష చేపట్టిన డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌కు మద్దతుగా చినగంజాంలోని భావనారాయణస్వామి ఆలయంలో గురువారం పూజలు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయకుమార్ తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు సంధు శ్రీనివాసరావు, టి.సతీష్‌కుమార్, టి.ఆదినారాయణ, బొప్పన శ్రీనివాసరావు, పి.వెంకటేష్, ఎన్.గోపి, అశోక్, చెరుకూరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలు గుర్తించి.. నివారించండి



కొప్పెరపాలెంలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో కుమారి

అద్దంకి, బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: సూక్ష్మపోషకాల లోపాలు గుర్తించి నివారించాలని సహాయ వ్యవసాయ సహాయకులు కె.ధన్‌రాజ్ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా అద్దంకి, బల్లికురవ మండలాల్లోని పలు గ్రామాల్లో గురువారం పంట పొలాలు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. అద్దంకి మండలం శంఖవరప్పాడులో మాగాణి భూములు పరిశీలించారు. అనంతరం శంఖవరప్పాడు సచివాలయం వద్ద జరిగిన సమావేశానికి ఏవో కె.వెంకటకృష్ణ అధ్యక్షత వహించారు. ఉద్యాన శాఖాధికారి దీప్తి మాట్లాడుతూ కూరగాయలు సాగు రైతులకు ఎకరాకు రూ.8వేలు చొప్పున విత్తనాలకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. పూల తోటలకు ఎకరాకు రూ.6,200 అందిస్తున్నట్లు వెల్లడించారు. పశుసంవర్ధక శాఖ సహాయకుడు డాక్టర్ అశోక్ మాట్లాడారు. సర్పంచి భూపతి రాంబాబు, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారి కోటేశ్వరరావు, సహాయకులు ప్రియాంక, రైతులు పాల్గొన్నారు.

★ బల్లికురవ మండలం కొప్పెరపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఏవో ఎస్‌వీపీ.కుమారి రైతులతో మాట్లాడారు. వీఏఏ బాషా, పశుసంవర్ధక శాఖ సహాయకులు లక్ష్మీకాంత్, గ్రామ పెద్ద కోట శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల భాగస్వామ్యంతో గృహాల పూర్తి

కొత్తపేట (వేటపాలెం), న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో మంజూరై పూర్తికాని గృహాలను లబ్ధిదారుల భాగస్వామ్యంతో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టాలని గృహనిర్మాణ శాఖ ఇన్‌ఛార్జి డీఈ సుబ్బారావు అన్నారు. కూటమి ప్రభుత్వం 'మన ఇల్లు మన గౌరం' పేరిట వీటిని వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో కొత్తపేటలోని డీఈ కార్యాలయంలో లేఅవుట్ల ప్రత్యేకాధికారులు, సచివాల ఇంజినీర్లతో ఆయన గురువారం సాయంత్రం సమావేశమయ్యారు. మండలంలో 1170 గృహాలు మంజూరు కాగా ఇంకా 245 గృహాలు మిగిలిపోయినట్లు అధికారులు గుర్తించారు. డీఈ శేషయ్య, వ్యవసాయాధికారి కాశీవిశ్వనాథం ఉన్నారు.

బల్లికురవ(అద్దంకి): గృహనిర్మాణ శాఖ ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను మార్చి నెలాఖరు లోపు పూర్తి చేసుకోవాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాంబాబు అన్నారు. బల్లికురవ సచివాలయం వద్ద గురువారం జరిగిన గ్రామసభలో మాట్లాడారు. మార్చిలోపు పూర్తికాని ఇళ్లకు బిల్లులు మంజూరయ్యే అవకాశం తక్కువగా ఉంటుందన్నారు.

ముగిసిన కార్యశాల

వేటపాలెం, న్యూస్‌టుడే: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో గడిచిన మూడు రోజుల నుంచి ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై ఎపైస్వేకేర్ ప్రైవేట్ లిమిటెడ్ సారథ్యంలో విద్యార్థులకు జరుగుతున్న కార్యశాల గురువారం ముగిసినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. విద్యార్థులకు యోగ్యతా పత్రాలు అందజేశారు. ప్రధానాచార్యుడు కె.జగదీష్‌బాబు, డాక్టరు సీవీస్‌రావు, ప్రోగ్రాం కన్వీనరు డాక్టరు రాజేంద్రప్రసాదు, కో-కన్వీనరు డాక్టరు ఆర్‌వీఎస్ హరీష్, ప్రతినిధులు గోపీకృష్ణ, రత్నాకరన్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో విజేతలు వీరే

జే పంగులూరు, న్యూస్‌టుడే: స్థానిక జే పంగులూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన మండల స్థాయి స్వర్ణాంధ్ర 2047 పోటీల విజేతలను ఎంఈవో జి.వీరాంజనేయులు ప్రకటించారు. వ్యాసరచనలో షేక్ సమీర(బూదవాడ), వక్తృత్వంలో సీహెచ్.గాయత్రి(చందలూరు), బృంద డిబేట్‌లో సీహెచ్.గాయత్రి, ఎస్.దీపికారాణి(చందలూరు) ప్రథమస్థానంలో నిలిచారని చెప్పారు.

ప్రాక్టీస్ బిట్లు

ఇండియన్ హిస్టరీ

1. 'స్వస్తిక' అంటే..
   1) ఇది ఒక మతపరమైన గుర్తు.
   2) గోధుమ, బార్లీని వర్షాకాలంలో 60 రోజుల్లో పండించడం.
   3) వరిని వర్షాకాలంలో 60 రోజుల్లో పండించడం.
   4) వరిని వేసవిలో 60 రోజుల్లో పండించడం.
2. శతపథ బ్రాహ్మణం ప్రకారం వరి నాట్లు వేసి పండించడాన్ని ఏమంటారు?
   1) కినుక 2) నెల్లూకా 3) స్వస్తిక 4) ప్లసుక
3. జనపదాల కాలంలో 'కుసుదిన్' అంటే..
   1) అప్పు ఇచ్చిన వ్యక్తి 2) అప్పు తీసుకున్న వ్యక్తి 3) మధ్యవర్తి 4) వర్తకుడు
4. జనపదాల కాలంలో బ్రాహ్మణులకు గౌరవంగా ఇచ్చే బంగారు నాణం?
   1) శతమానం 2) సువర్ణ 3) నిష్క 4) కృష్ణాల
5. కిందివాటిలో జనపదాల కాలంలో ప్రముఖ వర్తక కేంద్రం కానిది?
   1) రాజగృహ 2) చంప 3) కాశీ 4) బోధన్
6. జనపదాల కాలంలో రేవు పట్టణం కానిది?
   1) తక్షశిల 2) బరుకచ్ఛం 3) వైశాలి 4) కాశీ
7. కిందివాటిలో జనపదాల కాలం నాటి రహదారి మార్గం కానిది?
   1) కౌశాంబి నుంచి గంగా మైదానాల ద్వారా ఇరాన్, మధ్య ఆసియాకు
   2) రాజగృహ నుంచి కౌశాంబి, ఉజ్జయిని ద్వారా పశ్చిమ దేశాలకు
   3) గంగా మైదానాల ద్వారా రష్యాకు
   4) గంగా మైదానాల నుంచి దక్షిణ తూర్పు ప్రాంతాలకు

సమాధానాలు: 1-3; 2-4; 3-2; 4-1; 5-4; 6-4; 7-3.

ఈనాడు ప్రతిభ

pratibha.eenadu.net/eenadupratibha.net

ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కాలుష్యానికి పరిష్కారం.. శిలాజాలకు ప్రత్యామ్నాయం!

జీవద్రవ్యాల నుంచి ఉత్పత్తి అయ్యే ఇంధనాలే జీవ ఇంధనాలు. పెట్రోలియం లాంటి శిలాజ ఇంధనాలు సహజ ప్రక్రియలో చాలా నెమ్మదిగా తయారవుతాయి. కానీ జీవ ఇంధనాలను మాత్రం మొక్కలు, వ్యవసాయ, గృహ, పారిశ్రామిక జీవవ్యర్థాల నుంచి తక్కువ వ్యవధిలోనే ఉత్పత్తి చేయవచ్చు. అటు కాలుష్య సమస్యకు పరిష్కారంగా, ఇటు శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా వినియోగంలోకి వస్తున్న ఈ పునరుత్పాదక ఇంధన వనరుల గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ప్రధానంగా రవాణా రంగంలో వినియోగం అధికమవుతున్న ఈ జీవఇంధనాల రకాలు, ఉత్పత్తి వనరులు, అందుకు అవసరమైన సాంకేతికతలు, వాటి వినియోగం తీరుతెన్నులు, ఆర్థిక, పర్యావరణపరమైన ఉపయోగాలను తెలుసుకోవాలి.



జనరల్ స్టడీస్ - పర్యావరణ అంశాలు

జీవ ఇంధనాలు

జీవ ఇంధనాలకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జీవద్రవ్యరాశి వనరుగా ఉంటుంది. మొక్కల సంబంధిత పదార్థాలు/ జంతువుల వ్యర్థాలతోనే జీవద్రవ్యరాశి తయారవుతుంది. జీవ ఇంధనాలు 1) ఘన 2) ద్రవ 3) వాయువు రూపాల్లో ఉంటాయి.

ప్రాథమిక జీవ ఇంధనాలు: ఇందులో సేంద్రియ పదార్థం ప్రత్యక్షంగా జీవ ఇంధనంగా ఉపయోగపడుతుంది. **ఉదా:** వంటచెరకు, వుడ్‌చిప్స్, బ్రికేట్స్

ద్వితీయ జీవ ఇంధనాలు: ఈ ఇంధనాల్లో జీవ ద్రవ్యరాశికి చెందిన ప్రాసెస్ చేసిన పదార్థాలు ఉంటాయి. **ఉదా:** ఇథనాల్, బయోడీజిల్.

జీవఇంధనం తరాలు:

1) మొదటి తరం జీవ ఇంధనాలు: ఆహార పంటల ఉత్పన్నాలైన పిండిపదార్థాలు, చక్కెరలు, వెజిటబుల్ ఆయిల్స్, జంతువుల కొవ్వును ఉపయోగించి మొదటితరం జీవ ఇంధనాలను తయారుచేస్తారు. అంటే మొదటితరం జీవ ఇంధనాలు కిణ్వప్రక్రియ ద్వారా తయారవుతాయి. వీటి ఉత్పత్తి వనరులుగా మొక్కజొన్న, గోధుమ, చెరకు, షుగర్ బీట్, వేరుశనగ, సోయాబీన్స్, రాప్సీడ్ లాంటి వాటిని ఉపయోగిస్తారు. మొదటితరం జీవ ఇంధనాలకు **ఉదా:** బయోగ్యాస్, బయోడీజిల్, ఇథనాల్.

- ☆ మొదటితరం జీవ ఇంధనంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను వాహనాల ఇంజిన్ భాగాలను మార్పు చేసి ప్రత్యక్షంగానైనా ఉపయోగించవచ్చు లేదా పెట్రోలియంలో కలిపి కూడా వాడవచ్చు.
- ☆ 1 లీటర్ ఇథనాల్ = 1 లీటర్ పెట్రోల్ ద్వారా విడుదలయ్యే శక్తిలో 2/3వ వంతుకు సమానం.
- ☆ పెట్రోలియంతో కలిపి ఇథనాల్‌ను ఉపయోగించడం వల్ల వెలువడే కార్బన్, సల్ఫర్ ఉద్గారాలు తక్కువగా ఉంటాయి.

బయోగ్యాస్: మొదటి తరం జీవ ఇంధనాలకు ఉదాహరణ. ఇందులో 60 శాతం మీథేన్, 40 శాతం కార్బన్ డయాక్సైడ్, కొన్ని అరుదైన వాయువులు ఉంటాయి.

కిణ్వన ప్రక్రియ: కిణ్వన ప్రక్రియను జీవక్రియ ప్రక్రియగా నిర్వచించవచ్చు. దీనిలో బ్యాక్టీరియా, ఈస్ట్ ఆక్సిజన్ లేనప్పుడు గ్లూకోజ్‌ను యాసిడ్, ఆల్కహాల్ లేదా వాయువుగా మారుస్తుంది. ☆ వాణిజ్యపరమైన ఇథనాల్ ఉత్పత్తికి 'సాకరోమైసెస్' అనే ఈస్ట్‌ను ఉపయోగిస్తారు.

కొన్ని ముఖ్యమైన జీవ ఇంధనాలు:

బయో-ఇథనాల్: పిండిపదార్థం, చక్కెర పంటల లాంటి మూలాల నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా దీన్ని ఉత్పత్తి చేస్తారు. సాధారణంగా పెట్రోల్‌తో కలుపుతారు.

గమనిక: 2022, జూన్‌లో ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ కార్యక్రమం కింద దేశంలో పెట్రోల్‌లో సగటున 10% ఇథనాల్ కలపాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం సాధించింది. ఈ లక్ష్యం 2022, నవంబరు నాటికి సాధించాల్సి ఉండగా 5 నెలల ముందే సాధ్యమైంది.

బయోడీజిల్: కూరగాయలు/ మొక్కలు/జంతువుల నూనెల నుంచి ట్రాన్స్‌స్టెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా దీన్ని తయారుచేస్తారు.

బయోగ్యాస్: వృక్ష, జంతు సంబంధ వ్యర్థాలను వాయురహితంగా కుళ్లబెట్టడం ద్వారా బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు.

బయోఇథనాల్: బయో ద్రవ్యరాశిని కిణ్వప్రక్రియకు గురిచేసి బయో-బ్యూటనాల్ తయారు చేస్తారు.

- ☆ లూయిపాశ్చర్ 1857లో కిణ్వప్రక్రియను కనుక్కున్నాడు.
- ☆ 1857లో లాక్టిక్ యాసిడ్ క్షయం సూక్ష్మజీవుల వల్ల సంభవిస్తుందని నిరూపించాడు.
- ☆ 1860లో సూక్ష్మజీవుల పని పాశ్చరైజేషన్‌ను ప్రేరేపించిందని గుర్తించాడు.

2) రెండో తరం జీవఇంధనాల వెలికితీతకు ఉపయోగించే సాంకేతికత: మొదటితరం జీవ ఇంధనాలకు ఉపయోగించే ముడిసరకునే రెండోతరం జీవ ఇంధనాలకూ వాడతారు. అయితే అన్నిరకాలూ రెండోతరం జీవ ఇంధనాలకు ఉపయోగపడకపోవచ్చు, అందుకే ప్రత్యేకించి కొన్ని మొక్కలను పెంచి వాటి ప్రత్యక్ష జీవద్రవ్యరాశిని వినియోగించవచ్చు. ఇవి సాధారణంగా ఆహారేతర పంటలు. **ఉదా:** గడ్డిమారండి, జట్రోపా, కానుగ.

☆ ఈ ముడిసరకు లిగ్నో సెల్యులోజ్‌తో నిర్మితమై ఉంటుంది. అందుకే వీటి నుంచి ఇంధనాలు పొందాలంటే అనేక ప్రాసెసింగ్ దశలు అవసరమవుతాయి. **ఉదా:** 1) థర్మోకెమికల్ మార్పిడి (ఇందులో పైరోలైసిస్, గ్యాసిఫికేషన్ లాంటి చర్యలు ఇమిడి ఉంటాయి) 2) జీవరసాయన మార్పిడి (ఇందులో ట్రాన్స్‌స్టెరిఫికేషన్ లాంటి చర్యలు ఇమిడి ఉంటాయి)

3) మూడోతరం జీవ ఇంధనాలు: ఈ జీవఇంధనాలను ఆల్గల్ ఆయిల్/ఆల్గా ఆయిల్ అంటారు. ఎందుకంటే శైవల వర్గానికి చెందిన వాటితోనే ఈ జీవఇంధనాలను ఉత్పత్తి చేస్తారు. **ఉదా:** బోట్రియోకోకస్, స్కిజోఛైట్రియం లాంటివి. వీటి పొడి బరువులో సుమారుగా 80% లిపిడ్లు ఉంటాయి. క్లోరెల్లా, డునాలియెల్లా లాంటి శైవలాల్లోనూ లిపిడ్లు కలిసి ఉంటాయి. ట్రాన్స్‌స్టెరిఫికేషన్ ప్రక్రియను ఉపయోగించి లిపిడ్లను బయోడీజిల్‌గా మార్చవచ్చు.

బయోడీజిల్ లేదా జీవ ఇంధనాల ఉత్పత్తికి శైవలాలే ఎందుకు?: ☆ భూమిపైన అతివేగంగా పెరిగే మొక్కలు శైవలాలు. కాలానుగుణంగా పండే పంటల మాదిరి కాకుండా వీటిని సంవత్సరమంతా పెంచవచ్చు. ఒక హెక్టారులో పండించే శైవలం ఉత్పాదకత.. సోయాబీన్, జట్రోపా, మొక్కజొన్న మొక్కల కంటే 10 - 100 రెట్లు ఎక్కువ. ☆ శైవలాల జీవ ద్రవ్యరాశి మొత్తం అంత్య ఉత్పన్నంలో వినియోగమవుతుంది. ఇతర మొక్కల్లో ఈ విధమైన అనుకూలత ఉండదు. కానుగలో విత్తనాలు మాత్రమే జీవ ఇంధనాల తయారీకి ఉపయోగిస్తారు. ☆ జట్రోపా మొక్క విత్తనాలు దిగుబడి ఇవ్వాలంటే 2-3 ఏళ్లు పడుతుంది. అదే శైవలం దిగుబడి 2-3 రోజుల్లోనే వస్తుంది.

4) నాలుగో తరం జీవ ఇంధనాలు: విద్యుత్తు-జీవ ఇంధనాలు/ సూక్ష్మజీవుల ఇంధన కణాలు- MFC సాంకేతికతను ఉపయోగించి వీటిని ఉత్పత్తి చేస్తారు.

వ్యర్థాల నుంచి శక్తి ఉత్పత్తి చేయడం: క్షీణత చెందే ప్రతి సేంద్రియ వ్యర్థం శక్తి ఉత్పత్తికి ముడివనరుగా ఉపయోగపడుతుంది. సాంకేతికతతో ఘన, ద్రవ వ్యర్థాల ద్వారా కలిగే దుష్ప్రభావాలను తగ్గించవచ్చు. వ్యర్థాలను పలు విధాలుగా వర్గీకరించవచ్చు. 1) పట్టణ వ్యర్థాలు 2) పారిశ్రామిక వ్యర్థాలు 3) జీవ ద్రవ్యరాశి వ్యర్థాలు 4) బయోమెడికల్ వ్యర్థాలు.



వ్యర్థాల నుంచి శక్తిని పొందే సాంకేతికతలు: జీవక్షయం చెందే, చెందని వ్యర్థాల నుంచి పలు పద్ధతుల్లో శక్తిని పొందవచ్చు.

1) ఉష్ణమార్పిడి: ఇందులో దహన ప్రక్రియ ప్రధాన ఎంపికగా ఉంటుంది. ప్రస్తుతం ఈ విధానంపై దృష్టి సారించడం లేదు.

2) థర్మోకెమికల్ మార్పిడి: సేంద్రియ జీవక్షయం చెందని, తక్కువ తేమ ఉండే వ్యర్థాలను శక్తిగా మార్చడానికి ఈ విధానాన్ని ఉపయోగిస్తారు.

3) బయో కెమికల్ మార్పిడి: వాయురహిత జీర్ణక్రియ, కిణ్వప్రక్రియలు ఈ వర్గంలో ప్రధాన సాంకేతిక ఎంపికలు.

4) విద్యుత్తు కెమికల్ మార్పిడి: ఈ విధానంలో సూక్ష్మఇంధన కణాల (MFCs) ను ఉపయోగించి వ్యర్థాల నుంచి శక్తిని పొందుతారు.

జీవ ఇంధనాల ప్రయోజనాలు

జీవ ఇంధనాలు ప్రస్తుత ఇంజిన్ డిజైన్లకు అనుగుణంగా ఉంటాయి. విభిన్న పరిస్థితుల్లో బాగా పనిచేస్తాయి. ☆ ఇవి మెరుగైన లూబ్రికేటింగ్ లక్షణాలతో ఉంటాయి. ఇది వాహన ఇంజిన్ జీవితకాలాన్ని పెంచుతుంది. ఇంజిన్‌ను ఎక్కువసేపు పనిచేసే విధంగా చేస్తుంది. తక్కువ నిర్వహణ వ్యయం, కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

తక్కువ కార్బన్ ఉద్గారాలు: జీవ ఇంధనం పునరుత్పాదక వనరుల నుంచి తయారవుతుంది. శిలాజ డీజిల్‌తో పోలిస్తే తక్కువ మండే సామర్థ్యం ఉంటుంది. ☆ ప్రామాణిక డీజిల్‌తో పోలిస్తే జీవఇంధనం తక్కువ హానికరమైన కార్బన్ ఉద్గారాలను వెలువరిస్తుంది. ☆ జీవ ఇంధనాలు హరిత గృహ వాయువులను 65 శాతం వరకు తగ్గిస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ☆ జీవ ఇంధనాలకు ముడిసరకు సులువుగా లభ్యమవుతుంది.

ఆర్థిక భద్రత: ఎక్కువమంది ప్రజలు జీవ ఇంధనాల వైపు మొగ్గు చూపితే, ఒక దేశం శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవచ్చు. పెరుగుతున్న జీవ ఇంధన పరిశ్రమతో మరిన్ని ఉద్యోగాల సృష్టి సాధ్యమవుతుంది. ఇది మన ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుంది.

తక్కువ స్థాయి కాలుష్యం: జీవ ఇంధనాలు జీవక్షయం చెందుతాయి. ఫలితంగా వీటి రవాణా, నిల్వ లేదా ఉపయోగం సమయంలో నేల కాలుష్యం, భూగర్భజలాలు కలుషితమయ్యే అవకాశం తగ్గుతుంది.

ఖర్చు ప్రయోజనం: ప్రస్తుతానికి, బయో ఇంధనాల ధర మార్కెట్‌లో గ్యాసోలిన్ ధరతో సమానం. అయితే వీటిని ఉపయోగించడం వల్ల మొత్తం ఖర్చు-ప్రయోజనం చాలా ఎక్కువ. అవి స్వచ్ఛ ఇంధనాలు. అంటే మండేటప్పుడు తక్కువ కర్బన, సల్ఫర్ ఉద్గారాలను విడుదల చేస్తాయి. పారిస్ ఒప్పందంలోని లక్ష్యాల అమలుకు వీటికి డిమాండ్ ఏర్పడవచ్చు. భవిష్యత్తులో ఇవి చౌకగా మారే అవకాశం ఉంది.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

ఏపీపీఎస్సీ భారతదేశ చరిత్ర సింధు నాగరికత

డీఎస్సీ/టెట్ - 2024 బయాలజీ కంటెంట్

కూలీ ధరలు పెంచాలని హమాలీల డిమాండ్

చీరాల, న్యూస్‌టుడే: సివిల్ సప్లయిస్ గోదాములలో పనిచేస్తున్న కార్మికులకు కూలీ ధరలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో హమాలీలు ప్రదర్శన నిర్వహించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన గడియార స్తంభం కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. ఈసందర్భంగా హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి. శామ్యూల్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాసి షైడియ్య, సీపీఐ సీనియర్ నేత మేడా వెంకటరావు తదితరులు మాట్లాడుతూ కూలీ ధరల ఒప్పందం 2023తో ముగిసిందన్నారు. అప్పటి నుంచి ప్రభుత్వం పెంచలేదని చెప్పారు. ప్రభుత్వం స్పందించి, పెంచాలని కోరారు. శ్రీను, అప్పన్న, రాంబాబు, వెంకటరెడ్డి, దుర్గారెడ్డి, సూర్యనారాయణ, సతీష్, చందు పాల్గొన్నారు.



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తు న్న హమాలీలు

పీసీసీ కార్యదర్శిగా వెంకటేశ్వరరావు

వేమూరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా మండలంలో చావలికి చెందిన తాడికొండ వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

అద్దంకి, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన అద్దంకి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై సీహెచ్.ప్రవీణ తెలిపిన వివరాల ప్రకారం.. కలవకూరు గ్రామ శివారు గుర్రంవారిపాలేనికి చెందిన తన్నీరు సైదులు మార్టూరు మండలం వలపర్లలో నివసిస్తున్నారు. ఈనెల 24వ తేదీ రాత్రి ఏడు గంటల సమయంలో అద్దంకి నుంచి మార్టూరు మండలం వలపర్ల వెళుతున్నారు. గుర్రంవారిపాలెం దగ్గరకు వచ్చేసరికి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. స్థానికుల సహాయంతో క్షతగాత్రుడ్ని ఒంగోలు ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. ★ మండలంలోని రాళ్లపల్లికి చెందిన శ్రీలత కూలి పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తుంటారు. ఇటుక బట్టీల వద్ద పనులు నిర్వహించే ఎ.నాగేంద్రబాబు తన గురించి భర్త వద్ద అసభ్య పదజాలంతో దూషించినట్లు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్.ప్రవీణ తెలిపారు.

గృహ హింస కేసు నమోదు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: తనను మానసికంగా, శారీరకంగా హింసించడమే కాకుండా ఇంటి నుంచి గెంటేశారని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం చీరాల మండలం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో భర్తపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. తోటవారిపాలేనికి చెందిన వెంకట ఆంజనేయప్రసాద్‌తో అదే గ్రామంలోని నీలిమకు నాలుగేళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహమైంది. ఆ సమయంలో కట్నంతో పాటు కానుకలు అందించారు. భర్త మంగుళూరు ఎక్స్‌పెర్ట్ కళాశాలలో నీట్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నారు. కొంతకాలం బాగానే కాపురం చేసిన ఇతను వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను గృహ హింస పెడుతూ ఈనెల 19న ఇంటి నుంచి గెంటేశారని ఫిర్యాదు చేశారు. ఇందుకు కుటుంబ సభ్యులు సహకరించారని పేర్కొన్నారు. దీంతో పోలీసులు 85, 3 (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్టు

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: మండలంలోని అన్నంభొట్లవారిపాలెంలో జూదం ఆడుతున్న ఆరుగురిని గురువారం పట్టుకుని వారి నుంచి రూ.3400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పర్చూరు ఎస్సై మాల్యాద్రి తెలిపారు.

రూ.10 నాణెం తీసుకోనంటే నేరమే

చీరాల అర్బన్, వేటపాలెం, న్యూస్‌టుడే



మార్కెట్‌లో రూ.10 కరెన్సీ నోట్ల చలామణి బాగా తగ్గిపోయింది. దీంతో వ్యాపారులు, కొనుగోలుదారుల మధ్య లావాదేవీల నిర్వహణ కష్టంగా మారింది. ఇటీవల చిల్లర సమస్య తలెత్తడంతో ఆర్‌బీఐ రూ.10 నాణేలు విడుదల చేసింది. వీటిని వ్యాపారులు తీసుకోవాలని ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. తీసుకోకపోతే నేరమవుతుందని పేర్కొంది. గతంలోనే ఆర్‌బీఐ రూ.10 నాణేలు విడుదల చేయగా అవి ప్రజల వద్ద ఉన్నా లావాదేవీలు జరగకపోడంతో ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. చిన ముంబాయిగా పేరుగాంచిన చీరాల చుట్టుపక్కల ప్రాంతాలైన వేటపాలెం, జాండ్రపేట, ఈపూరుపాలెం, పందిళ్లపల్లిలో రూ.10 నాణేలు తీసుకోవడానికి వ్యాపారులు వెనుకాడుతున్నారు. ఇదే పరిస్థితి ప్రజల నుంచి ఎదురవుతోంది. దీంతో సమస్యగా మారింది. ఇటీవల ఆర్టీసీ ఉన్నతాధికారులు సైతం బస్సుల్లో టిక్కెట్ కోసం వీటిని ఇస్తే తప్పనిసరిగా తీసుకోవాలని, తిరస్కరించకూడదని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. రిజర్వు బ్యాంకు విడుదల చేసిన కరెన్సీ నోట్లు, నాణేలు చలామణి అవుతాయని, వాటిని తీసుకోబోమని చెప్పడం నేరమని బ్యాంకు అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైన వ్యాపారులు, ప్రజలు వీటిని తీసుకునేందుకు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నెరవేరనున్న జొన్నతాళి వాసుల దశాబ్దాల కల

మార్టూరు, న్యూస్‌టుడే: దశాబ్దాల కాలంగా అభివృద్ధికి నోచని గ్రామంలోని రోడ్ల అభివృద్ధికి చురుగ్గా పనులు సాగుతున్నాయి. మండలంలోని జొన్నతాళిలోని వివిధ కాలనీల్లో అంతర్గత రహదారులు దశాబ్దాల కాలంగా దుస్థితి చేరాయి. కనీసం పాదాచారులు నడిచేందుకు వీలు లేకుండా డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే జొన్నతాళిలోని వివిధ అంతర్గత రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులను ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కేటాయించింది. ఇందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఇటీవల గ్రామంలో పర్యటించిన సందర్భంగా సీసీ రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలను వేగవంతం చేయాలని పంచాయతీ సర్పంచి సానంపూడి నాగేంద్రమ్మకు సూచించారు. దీంతో గురువారం అంతర్గత రహదారుల నిర్మాణం కోసం కార్యపర్యవేక్షకుడు కృష్ణచైతన్య, మానం రామకృష్ణ తదితరుల నేతల నేతృత్వంలో పనులను ప్రారంభించారు.



జొన్నతాళిలో నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి పూజలు చేస్తున్న కార్యపర్యవేక్షకులు కృష్ణచైతన్య, రామకృష్ణ తదితరులు

స్వచ్ఛ చీరాలకు కృషి చేద్దాం

చీరాల, న్యూస్‌టుడే: ఇంటిని ఏవిధంగా పరిశుభ్రంగా ఉంచుకుంటామో బయటా అలాగే ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, స్వచ్ఛ చీరాలకు అందరు సహకరించాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులతో కలసి ఎమ్మెల్యే పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గవినివారిపాలెంలో బ్యాంకు శాఖకు..: రైతుల కోసం గవినివారిపాలెంలో యూనియన్ బ్యాంకు శాఖను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. ఈమేరకు ఒంగోలులో బ్యాంకు రీజనల్ మేనేజర్ రవీంద్రను కలసి ఈవిషయమై చర్చించారు. రీజనల్ మేనేజర్ శాఖ ఏర్పాటుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే

నేడు ఉద్యోగ మేళా

బాపట్ల: ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ పది, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ కోర్సులు చదివిన విద్యార్థులు విద్యార్హత పత్రాలతో హాజరు కావాలన్నారు.

స్వచ్ఛతా హీ సేవపై అవగాహన

మార్టూరు: మార్టూరు కిషోర్ కాలనీలో గురువారం స్వచ్ఛతాహీ సేవపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దళిత బహుజన రీసోర్స్‌సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు.

వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లకు అధిక ప్రాధాన్యం

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల విడుదలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. బల్లికురవ విద్యుత్తు కార్యాలయం వద్ద స్థానికులతో సమావేశం నిర్వహించారు. వీటి విషయంలో పూర్తి పారదర్శకతతో వ్యవహరిస్తున్నట్లు వెల్లడించారు. ఏడీఈ ఎం.సురేంద్రబాబు, ఏఈ కె.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు. విద్యుత్తు పరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు అధికారులు సూచించారు.

జవాబుదారీతనంతో పనిచేస్తున్నాం

చీరాల,న్యూస్‌డే: కూటమి ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ తనంతో పనిచేస్తోందని ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా బెస్తపాలెం 12వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

పెదగంజాం, నీలాయపాలెం (చినగంజాం), న్యూస్‌టుడే: వంద రోజుల పాలనలో విజయపథంలో ఉమ్మడి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెదేపా తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు పాద వీరయ్య పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా గురువారం వంద శాతం ఉపాధి నిధులు రూ.22 లక్షలతో పెదగంజాంలో, రూ.17.50 లక్షలతో నీలాయపాలెంలో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేసినట్లు పంచాయతీరాజ్ మండల ఏఈ డి.దాసు తెలిపారు. సర్పంచులు తూమాటి శ్రీనివాసరావు, నక్కల కృష్ణ, నాయకులు ఆసోది బ్రహ్మానందరెడ్డి, అజాద్, కిలారి వెంకట్రావు, దేవతోటి నాగరాజు, విష్ణు, ఏపీవో లక్ష్మీదేవి పాల్గొన్నారు.



పెదగంజాంలో సిమెంటు రోడ్డుకు శంకుస్థాపనలో అధికారులు, తెదేపా నాయకులు

పర్చూరు, యద్దనపూడి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెదేపా మండల అధ్యక్షుడు నల్లపనేని రంగయ్య చౌదరి తెలిపారు. ఏపీలో 100 రోజుల పాలన పూర్తిచేసుకున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరుపై గురువారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించారు. పర్చూరులో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, యద్దనపూడి మండలం గన్నవరంలో ఎంపీడీవో కృష్ణకుమారి, జడ్పీటీసీ సభ్యురాలు చుండి లక్ష్మీనారాయణమ్మ, వింజనంపాడులో ఉప సర్పంచి సాదినేని రంగారావు ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు.

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: బల్లికురవ మండలం చెన్నుపల్లిలో 'ఇది మంచి ప్రభుత్వం' పై ఇంటింటి కరపత్రాల ప్రచారం నిర్వహించారు. గ్రామ సర్పంచి ఏల్చూరి శివపార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు తంగిరాల రాహేల, పంచాయతీ కార్యదర్శి కాట్రగడ్డ అనిల్‌కుమార్, గ్రామ తెదేపా నేతలు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు.



పౌష్టికాహార ప్రదర్శన చేపట్టిన పర్యవేక్షకురాలు సుజాత, అంగన్‌వాడీలు

పౌష్టికాహార వారోత్సవాలు

యద్దనపూడి, న్యూస్‌టుడే: మండలంలోని గన్నవరంలోని కటారివారిపాలెంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పోషకాహారంపై పర్యవేక్షకురాలు డీహెచ్ సుజాత అవగాహన కల్పించారు.